


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 341 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శనివారం 19 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే..

**- 388 ఎకరాలపై అధికారుల దృష్టి**

- కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో రెండో రోజు ముగిసిన భూ సర్వే
- సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో 388 ఎకరాలపై అధికారుల దృష్టి
- మూడు గ్రామాల సరిహద్దుల్లోని భూముల గుర్తింపు, పరిశీలన
- పాత రైతుల వివరాలు, రెవెన్యూ రికార్డుల సేకరణ



**నేటి శుభోదయ, ఎర్రవల్లి :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి. ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.




### 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

# హైలెవల్ కమిటీ!

**- సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యం - సీఎం రేవంత్**

- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో సెక్షన్ 22–ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి,



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22–ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా .....

» 2

### దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్..

**- ఎమ్మెల్యేగా అనర్హత వేటు..!**

- 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం
- కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ
- ఏలేటి, కౌశిక్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా అయినట్లు స్పష్టీకరణ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ..

» 2



### 17 ఏళ్ల బాలికపై మైనర్ల రేప్ ఆపై మర్డర్..

మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న దుస్థితి!

- నిర్మానుష్య ప్రాంతంలో బాలిక మృతదేహం
- శవం పూర్తిగా కుళ్లిపోవడంతో కష్టమైన గుర్తింపు
- అనుమానాస్పద టెంపోను సీసీటీవీ ఆధారంగా గుర్తింపు
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వెలుగులోకి ఘోరం
- కత్తులు, రక్తపు మరకలున్న దుస్తుల స్వాధీనం

» 2

### ఏళ్ల నిరీక్షణకు తెర..

### టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

- అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు
- విడుదలైన ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్
- 2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు
- కార్మికుల వేతనాలపై చర్చించే అధికారం గుర్తింపు సంఘానికే

వివరాలు 2 లో

### నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన కేటీఆర్

- ఫార్ములా ఈ-రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్
- కోర్టుకు హాజరైన కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ మల్లేశ్వరరావు
- రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ అభ్యంతరాలు



» 2

### చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని : హరీశ్ రావు



- సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన
- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ

» 2



### సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం - బండి సంజయ్

- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ

» 2

### సోలార్ స్టార్టప్‌లో గూగుల్, బిల్ గేట్స్ పెట్టుబడి..

# రోబోలతో ఫామ్‌ల నిర్మాణం!

- రోబోలతో సోలార్ ఫామ్స్ నిర్మించే స్టార్టప్‌లో భారీ పెట్టుబడులు
- గూగుల్, బిల్ గేట్స్ ఫండ్‌తో పాటు 31.8 మిలియన్ డాలర్ల నిధులు
- కొత్త టెక్నాలజీతో రెట్టింపు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

**నేటి శుభోదయ, డెస్క్ :** సౌర విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్న ఒక స్టార్టప్‌పై టెక్ దిగ్గజాలు పెట్టుబడుల వర్షం కురిపించాయి. రోబోల సహాయంతో అత్యంత వేగంగా సోలార్ ఫామ్‌లను



నిర్మించే కాలిఫోర్నియాకు చెందిన 'ప్లాంటెడ్' అనే స్టార్టప్ తాజాగా 31.8 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 265 కోట్లు) నిధులను సమీకరించింది. ఈ పెట్టుబడులు పెట్టిన వారిలో గూగుల్, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌కు చెందిన 'బ్రేక్‌త్రూ ఎనర్జీ వెంచర్స్' వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉండటం ..

2

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

# హైలెవల్ కమిటీ!

**మొదటిపేజీ తరువాయి..** పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్..

## - ఎమ్మెల్యేగా అనర్హత వేటు!

**మొదటిపేజీ తరువాయి..** ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రిబ్యునల్ 2026 మార్చి 11న పిటిషన్లను తిరస్కరించిందని పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పీకర్ నిర్ణయంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును తొలుత సెప్టెంబర్ 16న వెలువరించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

# ఏళ్ల నిరీక్షణకు తెర..

## టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

## సోలార్ స్టార్టప్‌లో గూగుల్, బిల్ గేట్స్ పెట్టుబడి..

# రోబోలతో ఫామ్‌ల నిర్మాణం!

**మొదటిపేజీ తరువాయి..** గమనార్హం. సాధారణంగా సోలార్ ఫామ్‌లను నిర్మించాలంటే భూమిని చదును చేయడం అత్యంత ఖర్చుతో కూడిన, నెమ్మదిగా సాగే ప్రక్రియ. అయితే, ప్లాంటెడ్ సంస్థ రోబోలను ఉపయోగించి ఎగుడుదిగుడుగా ఉన్న సహజసిద్ధమైన భూభాగాల్లో కూడా సులభంగా సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తోంది. ప్రతి ప్యానెల్‌కు రోబోలు విడివిడిగా స్తంభాలను అమరుస్తాయి, తద్వారా భూమిని చదును చేయాల్సిన అవసరం ఉండదు. ఈ వినూత్న విధానం ద్వారా తక్కువ విస్తీర్ణంలోనే రెట్టింపు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, నిర్మాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని కంపెనీ వెల్లడించింది. గత ఏడాది 10 మెగావాట్ల ప్రాజెక్టులను పూర్తి చేసిన ఈ సంస్థ, ఈ ఏడాది 100 మెగావాట్ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే దాదాపు 20 గిగావాట్లకు పైగా ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇటీవలే ఒక డేటా సెంటర్ కోసం కేవలం 10 నెలల కాలంలోనే 28 మెగావాట్ల ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. తాజాగా సమీకరించిన నిధులతో తమ రోబోల సంఖ్యను పెంచుకోవడంతో పాటు, 'సేజ్' అనే తర్వాతి తరం రోబోను ఈ ఏడాదిలోనే లాంచ్ చేయాలని ప్లాంటెడ్ యోచిస్తోంది. డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో, వేగవంతమైన సౌర విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ పెరగడంతో ఇటువంటి సాంకేతికతలకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

# నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** ఫార్ములా ఈ–రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ–రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణ ఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.

# సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

## - బండి సంజయ్

**మొదటిపేజీ తరువాయి..** సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

# చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని : హరీశ్ రావు

**మొదటిపేజీ తరువాయి..** సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయం ఎందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.



# 17 ఏళ్ల బాలికపై మైనర్ల రేప్ ఆపై మర్డర్..

## మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న దుస్థితి!



**మొదటిపేజీ తరువాయి..** దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని స్వరూప్ నగర్‌లోని ఓ బహిరంగ ప్రదేశంలో పడేశారు. కొన్ని రోజుల తర్వాత అక్కడ మృతదేహం లభ్యమైంది. కుషక్ రోడ్ సమీపంలోని పొలాల్లో మృతదేహం పడి ఉందని సెప్టెంబర్ 13 ఉదయం పోలీసులకు సమాచారం అందింది. మృతదేహం తీవ్రంగా కుళ్లిపోవడంతో తొలుత బాధితురాలి లింగాన్ని కూడా ఫోరెన్సిక్ బృందాలు వెంటనే నిర్ధారించలేకపోయాయి. పోలీసుల ప్రకారం.. బాలికకు నిందితులతో ముందే పరిచయం ఉంది. వారంతా ఓ టెంపోలో కలిసి మద్యం సేవించిన తర్వాత బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మృతదేహంలో కొంత భాగాన్ని వీధి కుక్కలు తినేశాయని పోలీసులు తెలిపారు. ఓ చెయ్యి మృతదేహానికి దూరంగా పొలంలో లభించినట్లు చెప్పారు. బాలిక కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదు. ఆమె తరచూ ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేదని కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు 50కుపైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ టెంపోను గుర్తించారు. చీకటి, తక్కువ వెలుతురు కారణంగా తొలుత వాహనం నంబర్ స్పష్టంగా కనిపించలేదు. చివరకు టెంపోను ఖడ్డా కాలనీలో గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా మరో ముగ్గురి వివరాలు బయటపడ్డాయి. దీంతో 16 నుంచి 17 ఏళ్ల వయసున్న ముగ్గురు మైనర్లతో పాటు శివమ్ అలియాస్ సుదామాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న రెండు కత్తులు, నిందితులు ధరించిన రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరెవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 6 కింద కేసు నమోదు చేశారు.

# భగవాన్ దాస్ కాలనీలో ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమం.





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్న అరుణాచలం శ్రీ శ్రీ శ్రీ లలితా పరమేశ్వరి సహిత ద్వాదశ జ్యోతిర్లింగ అష్టాదశ శక్తి పీఠాల మహాక్షేత్రం శ్రీ శివ నాగ స్వామి గారు గణేష్ మండపాన్ని సందర్శించి భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. గణపతి మండప యాత్ర విశిష్టత, భగవన్నామ స్మరణ ప్రాధాన్యత, సనాతన ధర్మ విలువలు, ధర్మం–భక్తి–సేవ–సత్యవర్తన వంటి సద్గుణాల ఆవశ్యకత, మోక్ష సాధన దిశగా మానవ జీవన ప్రయాణం వంటి అంశాలపై ఆయన ఆధ్యాత్మిక వివరణ ఇచ్చారు.గణపతి మండప యాత్ర వంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం, సేవాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. నిత్యజీవితంలో భగవన్నామ స్మరణను అలవర్చుకోవడం ద్వారా భక్తిభావాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ శివ నాగ స్వామి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం శ్రీ గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దోసకాయను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు, యువత, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కేత వరపు రామకృష్ణ, సున్నం భూలక్ష్మి , వద్దిపర్తి హరి కృష్ణ,కుంజ ధర్మా, కుంజ సంతోష్, , పులిపాటి సుబ్బలక్ష్మి , రమేష్, సాయి కౌశిక్, లత, శ్రీదేవి, వీరమనీ, నిర్మల, వీరమ్మ, శ్రీను, సుధారాణి, భువనేశ్వరి, అంజలి, కౌసల్య, స్వరూప, నాగమణి, అనిత, సుశీల, హన్సిక, యామిని, వాణి, మాధవి, తులసి, షకీలా, యమునా, దుర్గా, శివాని, వరలక్ష్మి , రమాదేవి, పెద్ద ఎత్తున మహిళా భక్తులు మరియు కాలనీ వసూళ్లు పాల్గొన్నారు

# ఘనంగా స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గణనాధునికి పూజలు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టమల్ల శ్రీశైలం దంపతులు స్వామి వివేకానంద యూత్ గణనాధునికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ,ప్రతి ఏటా వినాయక చవితి వేడుకలు ప్రతి ఏటా ఘనంగా జరుపుకుంటామని అన్నారు భక్తిశ్రద్ధలతో పాటలు భజన కార్యక్రమాలు కోలాటలు నిర్వహిస్తామని తెలిపారు.గణనాథుని ఆశీస్సులు ప్రజల పై ఎల్లవేళలా ఉండాలని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.రామకృష్ణ,భాస్కర్, బన్నీ ప్రణతి, లక్ష్మీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టెలికాం ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష.






**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
భారత ప్రభుత్వ డిజిటల్ భారత్ నిధి( డి వి ఎన్) నిధులతో జిల్లాలో చేపడుతున్న టెలికాం ప్రాజెక్టుల పురోగతి, టెలికాం మౌలిక సదుపాయాలపై జిల్లా కలెక్టర్‌తో టెలికమ్యూనికేషన్స్ శాఖ, బిఎస్ఎన్ఎల్ అధికారులు సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ టెలికమ్యూనికేషన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కరరావు, ఎన్. సత్యనారాయణ కలెక్టర్‌ను కలిసి ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు.జిల్లాలో 16 చోట్ల 4 జి సాచురేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఈ ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నందున భూముల గుర్తింపు, కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అలాగే అన్ని శాఖల అధికారులతో ప్రతి నెలా జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశం నిర్వహించాలని, తవ్వకం పనులు చేపట్టే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా "కాల్ వెల్ఫేర్ యు డిగ్ " యాప్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆర్ ఓ డబ్ల్యు నిబంధనలకు అనుగుణంగా పట్టణ స్థానిక సంస్థలు అంతర్గత అనుపాలన ఉత్తర్వులు జారీ చేసేలా ఆదేశించాలని కోరారు.అధికారుల విజ్ఞప్తిపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏజీఎం కొత్తగూడెం సుభాష్, జేటీఓలు సందీప్, బాలకృష్ణ, సైదులు, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఊకె శేఖర్ రావు.



**ఇల్లందు, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టేకులపల్లి మండల అధ్యక్షులు ఆంగోత్ సంతులాల్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఆదారేషన్ కలిగి ఉన్న ప్రతి రేషన్ డీలర్ల సభ్యత తీసుకోవాలని ఈ సభ్యత్వం వల్ల డీలర్ కుండే ఉపయోగాలను ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో.జిల్లా అధ్యక్షులు ఊకె శేఖర్ రావు. అజ్మీర రామ గూగుల్ ఏం చందర్ గోగ్గల కళ్యాణ్.సోలం రాంబాబు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఘనంగా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

- **విశ్వకర్మ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రోజ్ నరేష్ చారి, ఇంద్రోజ్ పురుషోత్తమ చారి**





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
మంచాల మండలం విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆరుట్ల గ్రామంలోని విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు ఇంద్రోజ్ నరేష్ చారి ఉపాధ్యక్షుడు ఇంద్రోజ్ పురుషోత్తంచారి కార్యదర్శి కొల్లోజ్ శంకర చారి ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.యజ్ఞం పూజా కార్యక్రమం ఏర్పాటు చేశారు.యజ్ఞం పూజలో విశ్వకర్మ సంఘానికి చెందిన సభ్యులు దంపతులతో యజ్ఞంలో కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కృషి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆదేవుని వేడుకున్నారు ఈకార్యక్రమంలో పెద్దఎత్తున విశ్వకర్మ సంఘం కుటుంబాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున పాల్గొని విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామంలోని విశ్వకర్మ సంఘానికి చెందిన సభ్యులు కుల,పెద్దలు మహిళలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వికలాంగుడికి చేయూత: నర్సింగ్ పల్లిలో లబ్ధిదారునికి ఛార్జింగ్ సైకిల్ అందజేత





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వికలాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడమే లక్ష్యంగా పాలన సాగుతోందని నర్సింగ్ పల్లి సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ అన్నారు.సిరికొండ మండలం నర్సింగ్ పల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు మాద నర్సింగ్ రావుకు స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రత్యేక కృషి ఫలితంగా ముఖ్యమంత్రి సి.ఎం. రేవంత్ రెడ్డి మంజూరు చేసిన 'ఛార్జింగ్ సైకిల్'ను సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ శుక్రవారం ఘనంగా అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వికలాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు ఈ ఛార్జింగ్ సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పేదలు, దివ్యాంగుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఛార్జింగ్ సైకిల్ అందుకున్న లబ్ధిదారుడు మాద నర్సింగ్ రావు ఆనందం వ్యక్తం చేస్తూ.. "తన లాంటి వికలాంగులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తూ, అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు" తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణకుమార్, పంచాయతీ కార్యదర్శి పాషా, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాయిత ప్రశాంత్, గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చలో కొడంగల్ పంచ జన్య సంకల్ప సభ విజయవంతం చేయండి

- **పంచ జన్య సంకల్ప సభ వాల్ పోస్టర్ విడుదల**
- **తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు**




**మొహినాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పంచ జన్య వాల్ పోస్టర్ విడుదల చేశారు.ఈనెల ఆదివారం 20వ తేదీన కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలో కాలేజ్ గ్రౌండ్ లో పంచ జన్య సంకల్ప సభ విజయవంతం చేయాలని టిఆర్ఎస్ పార్టీ ఎంబిసీ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ ప్రజాపతి, టీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,పంచ జన్య సంకల్ప సభ ఉద్దేశం రాష్ట్రంలో అందరు సామాజికంగా అందరూ సమానంగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తే పంచ జన్య ఉచిత విద్య ఉచిత వైద్యం ఉపాధి వ్యవసాయం సామాజిక న్యాయం సాధ్యమైతుందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ బలోపేతం అవుతుందని రానున్న ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం అని వారు అన్నారు. ఈ సభకు చేవెళ్ల నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సహాయ కార్యదర్శి ఏనుగుల సంజీవరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎండి అన్వర్ ఖాన్, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపల్ కోశాధికారి షేక్ మొహమ్మద్ నూర్ భాయ్, టిఆర్ఎస్ పార్టీ మైనబాత్ మండల ప్రధాన కార్యదర్శి బొక్క సురేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు మద్యపాక శ్రీకాంత్ సాగర్, సయ్యద్ యాహియ తదితరులు పాల్గొన్నారు.

# దానం నాగేందర్ అనర్హత తీర్పు ప్రజాస్వామ్యానికి కీలక పరిణామం




**వికారాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వికారాబాద్: దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడే దిశగా కీలక పరిణామమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను శాసనసభ స్పీకర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు.ప్రజలు ఏ పార్టీ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించారో, ఆ ప్రజా తీర్పును గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. పార్టీ మార్పుల విషయంలో రాజ్యాంగం, చట్టం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో నిబంధనలను ఉల్లంఘిస్తే న్యాయస్థానాలు అడ్డుకట్ట వేస్తాయని ఈ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నవారు తీసుకునే నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా ఉండాలని ఆయన అన్నారు. దానం నాగేందర్ అనర్హత విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పు స్పీకర్ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తేలా చేసిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు, రాజ్యాంగ నిబంధనలకు అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ ఫిరాయింపుల విషయంలో ప్రజలే తగిన సమయంలో తమ తీర్పును వెల్లడిస్తారని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.

# తలకొండపల్లిలో ఘనంగా పాత్రికేయుడు పోతుగంటి గణేష్ జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల కేంద్రంలోక్యూ న్యూస్ మరియు ప్రజా వాయిస్ రిపోర్టర్ పోతుగంటి గణేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం తలకొండపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయ మిత్రుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గణేష్ కేక్ కట్ చేసి సహచర విలేకరుల మధ్య తన పుట్టినరోజును జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు ఆయనకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు.నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలం పడుతూ, వృత్తిధర్మాన్ని నమ్ముకుని ముందుకుసాగుతున్న గణేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సహచర పాత్రికేయులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సిహెచ్ విష్ణువర్ధన్ యాదవ్, తూర్పు శీను, రాజు, విజయ్ యాదవ్, ఫోటోగ్రాఫర్ రాహుఫ్ మరియు మండల పరిధిలోని పలువురు పాత్రికేయ మిత్రులు పాల్గొని గణేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కౌకూర్–యాప్రాల్ అభివృద్ధి పనులకు మంజూరు కల్పించాలి



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కౌకూర్ డివిజన్, 189 యాప్రాల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు మంజూరు కల్పించి త్వరితగతిన చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.పోచమ్మ ఆలయం నుంచి యాప్రాల్ ప్రధాన రహదారి వరకు, ఓం శ్రీ సమీపంలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంజూరు కల్పించాలని కోరారు. కౌకూర్‌లోని శ్మశానవాటిక అభివృద్ధి, కౌకూర్ ప్రధాన రహదారి నుంచి యాప్రాల్ ప్రధాన రహదారి వరకు వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన రహదారుల అభివృద్ధితో పాటు ప్రజలకు ఎదురవుతున్న పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రజా సమస్యలపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, అభివృద్ధి పనుల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, మాజీ పార్షురాం రెడ్డి, బండారి లక్ష్మణ్ యాదవ్, మల్లేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, తిరుపతి రావు, కొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో కుసుమ విత్తనాల పంపిణీ - రైతులకు అవగాహన కార్యక్రమం





**షాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ సీడ్స్ (NMEO–OS) 2026–27 కార్యక్రమంలో భాగంగా షాబాద్ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర ఆధ్వర్యంలో కుసుమ విత్తనాల పంపిణీ, కుసుమ పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన రైతులకు కుసుమ–లక్ష్మి ప్రియ (ISF–764) రకం ధృవీకరించబడిన విత్తనాలను పంపిణీ చేశారు.మొత్తం 20 క్వింటాళ్ల కుసుమ విత్తనాలను 200 హెక్టార్ల విస్తీర్ణానికి, హెక్టారుకు 10 కిలోల చొప్పున రైతులకు అందజేశారు. కుసుమ సాగు విధానం, పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడి పెంపునకు అనుసరించాల్సిన పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు కుసుమ పంటను ప్రత్యామ్నాయ నూనెగింజల పంటగా సాగు చేసి అదనపు ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని,నాణ్యమైన ధృవీకరించబడిన విత్తనాలను వినియోగించడం, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. పంట ప్రారంభ దశ నుంచే కలుపు నివారణ, తగిన ఎరువుల వినియోగం, తెగుళ్ల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, వ్యవసాయ శాఖ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కుసుమ సాగు విస్తీర్ణాన్ని పెంచి నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.అనంతరం షాబాద్ మండలానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, సర్పంచులు అశోక్, రాజేందర్ రెడ్డి, సందీప్, నవనీత స్వామి, స్వరూప మహేందర్ గౌడ్, శాంతమ్మ యాదయ్య, పోచయ్య, మంగమ్మ, సవిత, సుభాష్ చంద్ర, గోపాల్, సబితా గోవర్ధన్ రెడ్డి, నర్సింలు, స్వాతి, మాణిక్యం, ఎఫ్‌పీవో ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# బోనకల్ మండల అభివృద్ధిపై కలెక్టర్‌కు వినతి

- **ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక గ్రామ పంచాయతీ పరిధిలోనే కొనసాగించాలని విజ్ఞప్తి**



**బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** బోనకల్ మండలంలోని వివిధ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బోనకల్ మండలం మాజీ జెడ్పిటిసి బానోతు కొండ కలిసి వినతిపత్రం అందజేశారు.మండలంలోని గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గ్రామ పంచాయతీ పరిధిలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఎంపిక ప్రక్రియ కొనసాగితే అర్హులైన పేద కుటుంబాలను గుర్తించేందుకు, స్థానిక సమస్యలను పరిగణనలోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుందని వారు తెలిపారు. బోనకల్ మండలంలోని పేద, అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# నందిపేట్,డొంకేశ్వర్ మండలాలలో అటవీ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు





**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ ఆదేశానుసారం ఆర్మూర్ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ అరుణ్ కుమార్ సమక్షంలో శుక్రవారం నందిపేట్ సెక్షన్,డొంకేశ్వర్ మండలాల పరిధిలోని పలు రెస్టారెంట్లు,దాబాలు,కార్పెంటర్ షాపుల్లో అటవీ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.రెస్టారెంట్లు,దాబాల నిర్వాహకులకు అడవి జంతువుల మాంసాన్ని వండడం,నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని తెలియజేసి,ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ వన్యప్రాణుల మాంసాన్ని వినియోగించవద్దని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు.అదేవిధంగా కార్పెంటర్ షాపుల్లో అక్రమ కలప లేదా ఇతర అటవీ ఉత్పత్తులు ఉన్నాయా అనే విషయమై తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా గుర్తించిన కలపకు సంబంధించిన పత్రాలను పరిశీలించి,అక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.వన్యప్రాణుల సంరక్షణ,అక్రమ వన్యమాంసం,అక్రమ కలప రవాణా/నిల్వను అరికట్టేందుకు అటవీ శాఖ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.ఈ తనిఖీలలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి,బాల్కొండ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రణవీర్,నందిపేట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్,నందిపేట్ బీట్ ఆఫీసర్ లింబాద్రి పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అనంతగిరిపల్లిలో అవగాహన కార్యక్రమం



**వికారాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వికారాబాద్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు అనంతగిరిపల్లిలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ జర్నలిస్టుల మ్యూచువల్ యూనియన్ అధ్యక్షుడు అర్ద సుధాకర్ రెడ్డి పాల్గొని ప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు.ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత 13 రకాల ధ్రువపత్రాల్లో అవసరమైన ధ్రువపత్రాన్ని ఓటరు నమోదు అధికారులకు అందజేయాలని సూచించారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేలా అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్, ఓటరు నమోదు సిబ్బంది, వార్డు అధికారులు, స్థానిక నాయకులు రెడ్యా నాయక్, మాజీ కౌన్సిలర్ మురళి, డైరెక్టర్ రాజు నాయక్, సామాజిక మాధ్యమ ప్రతినిధులు నరసింహులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పక్కదారి పట్టియ్యడానికె పాలక ప్రతిపక్షం తిట్ల దండకం





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ప్రజా సమస్యలను పక్కదారి పట్టియ్యడానికె పాలక ప్రతిపక్షం తిట్ల దండకం మొదలు పెట్టాయని ప్రజల సమస్యలను విస్మరించి ఐదు రోజుల అసెంబ్లీ సాగించారానిసీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా విమర్శించారుసిరికొండ మండలం లోని గడ్కోల్ గ్రామం లో శుక్రవారం నాడు సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్★ నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్మిక – కర్షక – ప్రజావ్యతిరేక విధాన లకు నిరసనగా★ జిల్లా నాయకులు ఆర్. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభ లో సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతు పాలకపక్ష పార్టీలు ఎప్పుడైనా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపమన్నారు. ఒకవైపు రాష్ట్రంలో తీవ్రమైన సమస్యల్లో రైతాంగం కార్మిక వర్గం విద్యార్థి యువత కొట్టుమిట్టాడుతుంటే, ఐదు రోజులు జరిగిన అసెంబ్లీలో వాటిపై ఏమాత్రం చర్చించకుండా ఒకరిపై ఒకరు కేవలం తిట్లతో కాలక్షేపం మాత్రమే చేసి తమ స్వభావం ఏంటో మరోసారి నిరూపించుకున్నారు అన్నారు. పోయిన పార్టీ వాళ్లు సమస్యల్ని పట్టించుకోకుండా భూకబ్జాల్లో కోట్ల కోద్ది స్కామ్ చేశారని అధికార పక్షం అంటుంటే, అధికారం లో ఉన్న పార్టీ ప్రజలసమస్యలను విస్మరించి స్కామ్ లకు కబ్జాలకు పూనుకుంటున్నారని అయన అన్నారు. రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ముఖ్యంగా ఎరువులు అందక, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల రైతులు సమస్యలతో సతమతమవుతున్నరన్నారు రుణమాఫీ సంపూర్ణంగా జరగలేదని, అప్ ల వల్ల ఎరువులు అందలేని పరిస్ధితి ఉందని, రైతు బీమా లాంటి పథకాలు రైతుల దరి చేరడం లేదని, పండించిన పంటలను కొనుగోలు చేసే నాధుడే కరువయ్యారన్నారు. మాట ఇచ్చి బోనస్ ను కేవలం సన్న ధాన్యం కె ఇస్తాము అంటే ఇచ్చిన మాటను వదిలేయడమేనన్నారు. అట్లాగే వ్యవసాయ కూలీలకు కూడా 12 వేల రూపాయలు ఇస్తాం అని మొండి చేయి చూపరన్నారు. బీడీకార్మికలకు ఇస్తానన్న చేయూత పెన్షన్ ను ఇప్పటికి ఇవ్వకుండా మొఖం చాటేస్తున్నారన్నారు. ప్రజలు హామీల అమలు కోసం పోరాడాలని పిలుపు ను ఇచ్చారు. పోడుభూముల సమస్య వెంటనే పరిష్కరించాలి.★: పోడుభూముల సమస్య వెంటనే పరిష్కరించాలని లేకపోతే పోడు వ్యవసాయదారులు ప్రతిఘటిస్తారు అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా పోడు భూముల సమస్య తీవ్రంగా ఉంది అన్నారు. అసలు ఎన్నికల్లో పోడురైతుల సమస్యను తప్పకుండ పరిష్కారం చేస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన కేసీఆర్ లాగే సమస్యను అటవీశాఖ అధికారులతో అణిచి వేయాలి అని చూస్తుందీ అని ఇలా చేస్తే తప్పకుండ పోడు రైతులు నీలాదిస్తారు అన్నారు. బహిసభలో CPI(ML) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె రమ, వి ప్రభాకర్, రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, లు ప్రసంగించగా అయనతో పాటు కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు లాభలు చేకూరుస్తున్నాడన్నారు. నోట్ల రద్ద బ్యాంకులకు వచ్చేలా కుట్రలు పడ్డాడు అన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల పేదలు మరిం రామచంద్రానాల్సిన దుస్థి సెంట్రల్ జివి అంటూ జీఎస్టీ పేరు పన్నులు మూడవ ర పార్టీ సెక్రటేరియట్ సభ్యులు కెచ్చల రంగయ్య,కట్ట రమా ,వి ప్రభాకర్ ,వి కృష్ణ,చిన్న చంద్రన్న ఎం కృష్ణ,సూర్యం,హన్మేశ్,SL పద్మ,రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ ,బి రాము,జిరామయ్య,cy పుల్లయ్య, నందిరామయ్య, జిల్లా నాయకులు,ఆర్ రమేష్ బి దేవరం,నాయకులు ఆర్ దామోదర్,బి బాబన్న కిషోర్ రమేష్, రమ ,సత్తెమ్మ,పుష్ప,జమున,లావణ్య తదితరులు పాల్గొన్నారు

## ఆటో కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య రక్షణ కవచం




**శంషాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** రోజువారీ జీవనోపాధి కోసం శ్రమించే ఆటో కార్మికుల కుటుంబాలకు అనారోగ్య సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా సామాజిక సేవకుడు కందకట్ల సిద్ధురెడ్డి తన వంతు చేయూత అందించారు. శంషాబాద్ పరిధిలోని సుమారు 300 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల విలువైన ఆరోగ్య బీమా సౌకర్యాన్ని తన సొంత నిధులతో కల్పించారు. ఆరోగ్య బీమా పత్రాలను ప్రముఖ సినీ గీత రచయిత చంద్రబోస్, కందకట్ల సిద్ధురెడ్డి చేతుల మీదుగా ఆటో కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. అనుకోని అనారోగ్యం ఎదురైనప్పుడు వైద్య ఖర్చులు కుటుంబ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ఇలాంటి సమయంలో బీమా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిద్ధురెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆటో కార్మికులకు ఆరోగ్య బీమా అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్మికులకు ఆరోగ్య రక్షణ కల్పించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, వీలైనంత వరకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని పొందాలని సూచించారు. పేదలకు అండగా నిలవడమే తన లక్ష్యమని, తన శక్తి మేరకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని సిద్ధురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు ఆరోగ్య బీమా కల్పించడం అభినందనీయమన్నారు. కష్టపడి కుటుంబాలను పోషిస్తున్న కార్మికులకు వైద్యపరమైన భరోసా కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. బీమా సౌకర్యాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ మహేందర్, కొలన్ మహేందర్ రెడ్డి, ఆర్. గణేష్ గుప్తా, వెంకటేష్ గౌడ్ తదితరులు, ఆటో కార్మికులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అక్రమ భవనాలపై భయం: గోపన్‌పల్లిలో 4 అంతస్తుల భవనం వాలిపోవడంతో కలకలం





**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** హైదరాబాద్‌లో భవనాల భద్రతపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. గోపన్‌పల్లి, ఎన్‌టీఆర్ నగర్‌లో 50 చదరపు గజాల స్థలంలో నిర్మించిన నాలుగు అంతస్తుల భవనం శుక్రవారం ఒక్కసారిగా ఒక వైపుకు వాలిపోయింది.భవనం వాలిపోవడంతో భయాందోళనకు గురైన ప్రజలు వెంటనే బయటకు వచ్చారు. అధికారులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించి, చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని పరిశీలిస్తున్నారు. పునాది బలహీనత, నిర్మాణ లోపాలు లేదా అనుమతులు లేకుండా చేసిన మార్పుల వల్ల ఈ పరిస్థితి వచ్చిందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు.గచ్చిబౌలి, అంజయ్యనగర్‌లో అక్రమంగా నిర్మించిన ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి చెందిన ఘటన జరిగి కొన్ని వారాలు కూడా కాలేదు. ఆ ఘటన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.సిఎంసి పరిధిలో ప్రశ్నలు: సిఎంసి పరిధిలో కొనసాగుతున్న అనుమతిలేని నిర్మాణాలపై అధికారులు ఎప్పుడు కఠిన చర్యలు తీసుకుంటారనే ప్రశ్న ప్రజల్లో ఉంది. గోకుల్ ప్లాట్స్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అనుమతి లేకుండా, "జీరో పర్మిషన్"తో నిర్మాణాలు కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. ఇకనైనా CMC అధికారులు అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక ఎప్పటిలాగే మౌనం వహిస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకముందే అధికారులు అన్ని అనుమతిలేని నిర్మాణాలను తనిఖీ చేసి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ విద్యా దశకోటి మహా కుంకుమార్చనలో పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్



**నాగోల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నాగోల్ డివిజన్‌లోని శుభం కన్వెన్షన్ హాల్ లో శ్రీ రాజ రాజేశ్వరి దేవి దివ్య ఆశీస్సులతో నిర్వహిస్తున్న "శ్రీ విద్యా దశకోటి మహా కుంకుమార్చన " కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, పాల్గొన్నారు.శ్రీ శ్రీ అభిషేక్ బ్రహ్మచారి స్వామీజీ గారి పవిత్ర సాన్నిధ్యంలో, లోక కల్యాణం, సర్వలోక శాంతి మరియు ప్రజల సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ మహా ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..శ్రీ శ్రీ అభిషేక్ బ్రహ్మచారి స్వామీజీ గారి సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ మహా కుంకుమార్చన కార్యక్రమం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనదని అన్నారు. దేశవ్యాప్తంగా హిందూ సువాసిని మహిళల భాగస్వామ్యంతో ఇలాంటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.అమ్మవారి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, సమాజంలో భక్తి, ఐక్యత, సద్భావన మరింత పెంపొందాలని ఆమె ఆకాంక్షించారు. శ్రీ శ్రీ అభిషేక్ బ్రహ్మచారి స్వామీజీ గారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.ఈ మహా కుంకుమార్చన కార్యక్రమంలో నిర్వాహకులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, హిందూ సువాసిని మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.అమ్మవారి ఆశీస్సులతో లోక కల్యాణం – సర్వలోక శాంతి.

## తాటి రామక్క దశ దిన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మధుకర్



**మంథని, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మంథని పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన తాటి మల్లయ్య మాతృమూర్తి తాటి రామక్క ఇటీవల మరణించగా వారి దశ దిన కర్మ కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా ఆ కార్యక్రమంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పాల్గొని రమక్క చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పుప్పాల తిరుపతి, ఆకుల రాజబాబు,గాజుల సురేష్, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

## క్రీడా స్ఫూర్తితో సత్తా చాటిన విద్యార్థులు






**కేశంపేట, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కేశంపేట మండల కేంద్రంలోని ఎడ్యుకోజ్ పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 16న ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు.మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాధికారి ఎం. చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ నెల 25 నుంచి షాద్‌నగర్‌లో ప్రారంభమయ్యే ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మరింత పట్టుదలతో సాధన చేసి మంచి ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సిబ్బంది, సమగ్ర శిక్షణ వనరుల ఉపాధ్యాయులు రామకృష్ణ, మల్లేష్, మల్లయ్య, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులు పాల్గొన్నారు. గ్లోబల్ పాఠశాల నిర్వాహకులు రామకృష్ణాచారి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, వెంకటరెడ్డి, తిరుపతి, రాము, రవీందర్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
శుక్రవారం | హైదరాబాద్
18 - 09 - 2026
www.netisubhodaya.com


## ఘనంగా గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ములుగు, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు, ఆర్‌వీఎం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆర్‌వీఎం హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరంలో వైద్య విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది, హాస్పిటల్ ఉద్యోగులు, డాక్టర్ రంజిత్ రెడ్డి అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం హాస్పిటల్‌లోని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది రోగుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. జన్మదిన వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఓ. శ్రావణ్ కుమార్, డైరెక్టర్ పి. రాజేందర్, డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ, డైరెక్టర్ రవీందర్ గౌడ్, సీఈఓ దేవరకొండ శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ రాజ్ కుమార్, మెడికల్ కాలేజీ విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సురక్షిత్ జిల్లానే లక్ష్యం





**తలకొండపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల కేంద్రంలోక్యూ న్యూస్ మరియు ప్రజా వాయిస్ రిపోర్టర్ పోతుగంటి గణేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం తలకొండపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయ మిత్రుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గణేష్ కేక్ కట్ చేసి సహచర విలేకరుల మధ్య తన పుట్టినరోజును జ రుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు ఆయనకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు.నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలం పడుతూ, వృత్తిధర్మాన్ని నమ్ముకుని ముందుకుసాగుతున్న గణేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సహచర పాత్రికేయులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సిహెచ్ విష్ణువర్ధన్ యాదవ్, తూర్పు శీను, రాజు, విజయ్ యాదవ్, ఫోటోగ్రాఫర్ రాహుఫ్ మరియు మండల పరిధిలోని పలువురు పాత్రికేయ మిత్రులు పాల్గొని గణేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిరుపేద విద్యార్థి విద్యకు చేయూతనం దించిన భాస్కర్ నాయక్



**జడ్చర్ల, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** జడ్చర్ల పట్టణానికి చెందిన ఆకుల శారద రెడ్డి కుమార్తె ఆకుల స్నేహలత రెడ్డి కొండాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో రెండేళ్లు విద్యాభ్యాసం చేసింది. పై చదువులు కొనసాగించేందుకు అవసరమైన సర్టిఫికెట్లు పొందాల్సి ఉండగా, కళాశాల ఫీజు చెల్లించే స్థోమత లేకపోవడంతో కుటుంబం ఆందోళనకు గురైంది.ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త జరుపుల భాస్కర్ నాయక్ రూ.50 వేల రూపాయలును అందజేశారు. దీంతో కళాశాల ఫీజు చెల్లించి,వారు సర్టిఫికెట్లు పొందారు.ఒక విద్యార్థి భవిష్యత్తుకు అండగా నిలవడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ తల్లికి భరోసా కల్పించడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు. చదువుపై ఉన్న స్నేహలత రెడ్డి ఆశలను నిలబెట్టేందుకు అందిన ఈ సహాయం ఆమె ఉన్నత విద్యా ప్రయాణానికి తోడ్పడనుంది.చదువుకు అడ్డంకిగా నిలిచిన ఆర్థిక సమస్యను తొలగించి.. ఓ విద్యార్థి కలలకు అండగా నిలిచిన ఈ సహాయం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ సహాయం అందుకున్న శారదా రెడ్డి, ఆమె కుమార్తె, భాస్కర్ నాయక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిజామాబాద్ లో స్టార్ హెల్త్ ఆరోగ్య సేవ కేంద్రం ఉన్నతమైన సేవలు




**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లాలో స్టార్ హెల్త్ ఆరోగ్య సేవా కేంద్రం ఉన్నతమైన సేవలు అందిస్తున్నది అని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ అన్నారు.తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్,ఛత్తీస్గఢ్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ మాట్లాడుతూ....డాక్టర్ కన్సల్టేషన్లు,ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు,హెల్త్ కౌన్సిలింగ్,ఔషధాలు,టీకా పరమైన సేవలను స్టార్ హెల్త్ ఆరోగ్య సేవా కేంద్రం కార్యాలయంలో పిరమల్ స్వస్త్య మేనేజ్మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్నామన్నారు.జిల్లా కేంద్రంలో ఆరోగ్య సేవ కేంద్రం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు సుమారు 3800 మందికి పైగా ప్రజలు స్టార్ హెల్త్ ఆరోగ్య సేవా కేంద్రం సదుపాయాలను ఉపయోగించుకున్నారు.ప్రతిరోజు ఓపీ 15 నుండి 20 మంది నమోదు చేసుకుంటున్నారు.ఈ ఆరోగ్య సేవ కేంద్రాన్ని తరచుగా 40 సంవత్సరాలు నుంచి 80 సంవత్సరాల వారు ఎక్కువగా చూయించు కుంటున్నట్టుగా తెలిపారు.అత్యధికంగా మధుమేహం,బ్లడ్ ప్రెషర్,హైపర్ టెన్షన్,జ్వరం వంటి ఆరోగ్య సమస్యలకు వైద్య సహాయం తీసుకుంటున్నారన్నారు.ఇప్పటివరకు మా ఈ సెంటర్లో 2700 వందల మందికి పైగా హైపర్ టెన్షన్(బీపీ) పరీక్షలు చేయించుకున్నారు,అలాగే 1900 వందల మందికి పైగా మధుమేహం పరీక్షలు చేయించుకున్నారు.స్టార్ హెల్త్ ప్రస్తుతం తమ సి ఎస్ ఆర్ పోర్ట్ పోలియో కింద నిజామాబాద్,ఖమ్మం,మహబూబ్నగర్,కరీంనగర్లలో ఆరోగ్య సేవ కేంద్రాలను నిర్వహిస్తున్నాము అని అన్నారు.నిజామాబాద్ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను మరింతగా అందుబాటులోకి తేవాల్సిన అవసరాన్ని నిజామాబాద్ లోని ఆరోగ్య సేవ కేంద్రానికి లభిస్తున్న స్పందన తెలియజేస్తుందన్నారు.ఈ స్టార్ హెల్త్ ఆరోగ్య సేవా కేంద్రంలో ఒక డాక్టర్,నర్సు,సహాయక సిబ్బంది ఉంటారన్నారు.షుగర్,బ్లడ్ షుగర్ టెస్టింగ్,రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్టింగ్,హిమోగ్లోబిన్ టెస్టింగ్,అల్బ్యూమెనిక్ సంబంధించిన మూత్ర పరీక్షలు మొదలైన పరీక్షలను అందిస్తున్నాం.ఈ కార్యక్రమంలో తెలంగాణ రీజినల్ హెడ్ సురేష్,ఆరోగ్య సేవా కేంద్రం డాక్టర్ సాయి చరణ్,స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పి ఆర్ ఓ బండారి తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పంపిణీతో పచ్చదనానికి బోనకల్ సర్పంచ్ శ్రీకారం

- **గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి -సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**

**బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం, మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పరిశుభ్రమైన వాతావరణం వల్ల అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల విద్యార్థులు కూడా మొక్కల సంరక్షణపై అవగాహన పెంచుకుని, తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు."వ్యాధులు సోకకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.. పచ్చదనాన్ని పెంచి ఆరోగ్యకరమైన బోనకల్‌ను నిర్మిద్దాం" అని సర్పంచ్ బానోతు జ్యోతి కొండ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప





సర్పంచ్ భాను కొండ, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కష్టాలకు పరిష్కారం ఎన్నడు?

**వికారాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: మండలంలోని రైతులకు విద్యుత్ సమస్యలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తరచూ విద్యుత్ కోతలు, అల్ప వోల్టేజీ కారణంగా విద్యుత్ మార్పిడి పరికరాలు కాలిపోతుండటంతో సాగు పనులకు ఆటంకం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఈ సమస్య పునరావృతమవుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు.ఒక విద్యుత్ మార్పిడి పరికరం కాలిపోతే దాన్ని మరమ్మతు చేయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. గతంలో కుల్కచర్లలోనే విద్యుత్ మార్పిడి పరికరాల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని రైతులు అంటున్నారు.ప్రస్తుతం కాలిపోయిన విద్యుత్ మార్పిడి పరికరాలను మరమ్మతుల కోసం పరిగి విద్యుత్ కేంద్రానికి తరలించాల్సి వస్తోందని తెలిపారు. ఇందుకోసం రైతులు వేల రూపాయలు వెచ్చించి ట్రాక్టర్ అద్దెకు తీసుకోవాల్సి వస్తోందని, అక్కడ ఒకే మరమ్మతు కేంద్రం ఉండటంతో పరికరాల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ అందక నష్టపోతున్నామని పేర్కొన్నారు.రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కుల్కచర్ల విద్యుత్ కేంద్రంలోనే మార్పిడి పరికరాల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అల్ప వోల్టేజీ సమస్యను పరిష్కరించి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని మండల రైతులు, వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.



## V4 ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్లు: నాయకోటి పవన్ కుమార్, చింతల అరుణ సురేందర్ యాదవ్

**నాగోల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్ వేదికగా V4 ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న V4 ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ మరియు నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, దంపతులు పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఇరువురు కలిసి వివిధ రకాల ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, షాపింగ్ మరియు నూతన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సందర్శించి, అక్కడి ప్రత్యేకతలను పరిశీలించారు. ఈ



కార్యక్రమాన్ని ఎంతో చక్కగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు స్థానిక వ్యాపారవేత్తలు, డిజైనర్లు మరియు మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేసుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా V4 ఆర్గనైజర్ శ్రీమతి పొరెడ్డి కవిత రెడ్డి గారికి మరియు మొత్తం నిర్వాహక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్త తిరుమల, ఊరెళ్ళి రామకృష్ణ మరియు అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొనడం జరిగింది.



# రైతులకు ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకూడదు




**నిజామాబాద్ , సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు,కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు.రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు.ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహించ నున్న నిర్వాహకులతో సన్నాహక సమావేశం,శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ......ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ రైతులకు అవసర మైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బం దులకు గురికాకుండా,పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగా లన్నారు.కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.సరి పడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం,తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని,ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఏమైనా సమస్యలు గమనించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు.సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా,సమ న్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని,ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీ లక పాత్ర పోషించాలని సూచించారు.నిర్దేశిత లక్ష్యానికి అనుగు ణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట గోడౌన్లకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్,సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్,ఏఎస్ఓ అరవింద్ రెడ్డి,మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగుబాయి,తూనికలు కొలతల శాఖ అధికారి షుజాత్ అలీ తదిత రులు పాల్గొన్నారు.

# పరదాల చాటున అక్రమ నిర్మాణాల దందా!

- **మౌలాలి సర్కిల్‌లో నిబంధనలకు పాతర.. బిల్డర్ల ఇష్టారాజ్యం**
- **అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా!**
- **ఫిర్యాదులు ఫైళ్లలోనేనా? నోటీసులతోనే సరిపెడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు**
- **అప్రభుత్వ ఆదాయానికి గండి.. ప్రజల భద్రతకు ముప్పు**





**నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మౌలాలి సర్కిల్ పరిధిలో భవన నిర్మాణ నిబంధనలు బిల్డర్లకు ఏమాత్రం పట్టడం లేదా? నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు సాగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధి కారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకో వడం లేదు? ఫిర్యాదులు అందుతున్నా క్షేత్ర స్థాయిలో నిర్మాణాలను ఎందుకు అడ్డుకో వడం లేదు? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికుల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా కాకతీయనగర్, రోహిణి కాలనీ, ఆకుల నారాయణ కాలనీ, ఆనంద్‌బాగ్, మౌలాలి తదితర ప్రాంతాల్లో అనుమతు లకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నా యన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పర దాలు కట్టి.. దర్జాగా నిర్మాణాలు!కాకతీయ నగర్ ప్రధాన రహదారిపై ఓ నిర్మాణదా రుడు స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకు అనుమతి పొందినట్లు సమాచారం. అయితే అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టి, పెయింటింగ్ పనులు పూర్తయిన తర్వాత షట్టర్ల ఏర్పాటు కోసం చుట్టూ పరదాలు కట్టి వాటి చాటున పనులు కొనసాగిస్తున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదా రికి ఆనుకుని వాణిజ్య అవసరాలకు అను గుణంగా షట్టర్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందినా నిర్మాణాన్ని నిలిపివేసే స్థాయిలో చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అనుమతుల పరిధిని దాటి నిర్మాణం జరుగుతోందా? లేక అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారమే పనులు సాగుతున్నాయా? అన్నది స్పష్టం చేయాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ శాఖపై ఉంది.పాత భవనా లపై కొత్త అంతస్తులు.. ఎవరి అండ?కాక తీయనగర్ ప్రధాన రహదారిలోని లిటిల్ పేరాల్స్ పాఠశాల ఎదురుగా ఉన్న పాత ఇంటిపై మరో అంతస్తుతో పాటు భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్నట్లు స్థానికులు చెబు తున్నారు. కాకతీయనగర్ రోడ్ నంబర్–3లోనూ పాత భవనంపై అదనపు అంతస్తుల నిర్మాణం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.పాత భవనా లపై అదనపు అంతస్తులు నిర్మించేందుకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ నిబంధ నల మేరకు అనుమతులు ఇచ్చారు? లేక అనుమతులు లేకుండానే నిర్మాణాలు సాగు తున్నాయా? అనే విషయాలపై అధికారులు బహిరంగంగా స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.ఫిర్యాదులు చేస్తే నోటీసులే.. ఆ తర్వాత?అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నా నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత నిర్మాణాలు యథావిధిగా కొనసా గడం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తు న్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు ఆగకపోతే తదుపరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. నిర్మాణం ప్రారంభ దశలోనే నిబం ధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించి అడ్డుకోవాల్సిన అధికారులు, నిర్మాణం శర వేగంగా సాగుతున్న సమయంలో మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తు న్నాయి.బిల్డర్ల దూకుడు.. అధికారుల మౌనం?అనుమతులు తీసుకున్న విస్తీర్ణం, అంతస్తులు, వినియోగం ఒకటైతే.. క్షేత్ర స్థాయిలో నిర్మాణాలు మరోలా ఉంటున్నా యన్న ఆరోపణలు మౌలాలి సర్కిల్‌లో చర్చ నీయాంశంగా మారాయి. నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణాలు చేపట్టే వారికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే అక్రమ నిర్మాణాలకు మరింత ఊతం లభించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ని ర్మాణదారులపై చర్యలు తీసుకోవాల్సిన అధి కారులు కేవలం నోటీసులతోనే ఎందుకు సరిపెడుతున్నారు? ఫిర్యాదులు వచ్చిన ప్రతి నిర్మాణంపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల ప్రతిని ధులు అంటున్నారు.ప్రభుత్వ ఆదాయానికీ గండి?అనుమతులకు మించి నిర్మాణాలు జరిగితే సంబంధిత రుసుములు, పన్నులు, జరిమానాల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతు న్నారు. అక్రమ నిర్మాణాలు కొనసాగితే ఒకవైపు ప్రభుత్వ ఆదాయానికి నష్టం, మరోవైపు భవిష్యత్తులో మౌలిక వసతులపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడుతుం దని వారు పేర్కొంటున్నారు.పార్కింగ్ ఎక్కడ? రోడ్లు ఎవరి కోసం?కాకతీయనగర్ వంటి రద్దీ ప్రాంతాల్లో వాణిజ్య భవనాలు పెరుగుతున్నా పార్కింగ్, సెట్‌బ్యాక్స్, రహదారి వెడల్పు, అగ్నిమాపక భద్రత తదితర నిబంధనలు పాటించకపోతే భవి ష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే రహదారులపై వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నా యని, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయ కపోతే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని అంటున్నారు.ఉన్నతాధి కారుల తనిఖీలు ఎప్పుడు?మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయనగర్‌తో పాటు రోహిణి కాలనీ, ఆనంద్‌బాగ్, వినాయకన గర్, ఓల్డ్ సఫిల్‌గూడ, ఆకుల నారాయణ కాలనీ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అనుమతులు ఎంత?.. నిర్మాణం ఎంత?నిబంధనలు పాటిస్తు న్నారా?.. ఉల్లంఘిస్తున్నారా?ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి?అనే అంశాలపై సమగ్ర క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుం చాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవా లని, అధికారుల నిర్లక్ష్యం ఉంటే దానిపైనా ఉన్నతాధికారులు విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



**హన్మకొండ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** హసన్‌పర్తి మండలం ఎల్లా పూర్ గ్రామంలోని శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంఘం గ్రామ అధ్యక్షుడు శ్రీపెల్లి ప్రవీణ్ కుమార్ (పులి) ఆధ్వర్యంలో విశ్వ కర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వధర్మం సత్యం, ధర్మం, ప్రేమ, మానవత్వం, సమానత్వానికి ప్రతీక అన్నారు. వృత్తులు, నైపుణ్యాలు, శిల్ప సంప్ర దాయాలను కాపాడుతూ యువత విద్య, నైపుణ్యా భివృద్ధి వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చా రు.కార్యక్రమంలో సంఘ నాయకులు వెలిశోజు శ్రీరామ్, బుచ్చయ్య చారి, సునీల్ చారి, కొడార్ల శ్రీనివాస్, వెంకటేశ్వర చారి, రవీంద్ర చారి తది తరులు, గ్రామస్తులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో శివపుత్ర గణేష్ మహారాజ్‌ను దర్శించుకున్న లింగాల కమల్ రాజు



**బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మండలం లోని గిరిజన కాలనీలో ప్రతి ష్ఠించిన శివపుత్ర గణేష్ మహారాజ్‌ను మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, ప్రజలందరూ సుఖసంతోషా లతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...నిమజ్జన కార్యక్ర మాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వ హించుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జన వేడుకల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బానోతు కొండ, సర్పంచ్ బానోతు జ్యోతి, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపునేని సుధాకర్ రావు, వార్డు సభ్యులు తాళ్లూరు జ్యోతి, జరుపుల లావణ్య, నాగేశ్వరరావు, షేక్ బాజీ, బోడ యోగి శ్రీనివాస్, శ్రీరామ్, గోపి, ఉపేందర్, గోపి మరియు తదితర గణేష్ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## కలిగోట్ సంఘ భవనాల నిర్మాణానికి రూ.10లక్షలు



**నిజామాబాద్ , సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామంలో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షలతో పాటు ఎస్సీ(మాదిగ)సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు.అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.గ్రామస్తులు అందరు సమిష్టిగా ఉంటూ.. గ్రామాభివృద్ధిలో ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజు నాయక,రెడ్డి సంఘం వాకిటి పెద్ద భోజన్న,ఎస్సీ సంఘం గంగాధర్,అల్లూరి శ్రీనివాస్,లింబాద్రి,సాయి రెడ్డి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళయినా నిధులు శూన్యం....

- **అర్బన్ సమస్యలపై అనేకసార్లు లేఖలు అందజేశా..**
- **అసెంబ్లీలో ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ....**



**నిజామాబాద్ , సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ప్రత్యేక నిధులు విడుదల కాలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ స్కూల్‌పై ముఖ్యమంత్రి,విద్యాశాఖ మంత్రికి మూడు సార్లు లేఖలు ఇచ్చినా స్పష్టత లేదన్నారు.కళాభారతి,మాధవనగర్ బ్రిడ్జి పనులకు బిల్లులు చెల్లించలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారన్నారు.అలాగే నిజామాబాద్ బస్టాండ్ పరిస్థితి మండల కేంద్రం బస్టాండ్‌లా ఉందని,దీని అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని విమర్శించారు.ఇక జీజీహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిపై గతంలో సమీక్షలు జరిగినా పరిస్థితుల్లో మార్పు లేదన్నారు.ప్రధానంగా ఆసుపత్రి మార్చురీలో ఫ్రీజర్లు లేక దుర్వాసన వస్తోందని,జనరల్ వార్డుల్లోనూ సమస్యలు ఉన్నాయన్నారు.800 మంది విద్యార్థులకు ఒక బాలికల ప్రభుత్వ పాఠశాల(పబ్లిక్ స్కూల్ )ఏర్పాటు ప్రతిపాదన చేసినా నిజామాబాద్‌లో ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు.

## చెరువులు, నాలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు








**హన్మకొండ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని చెరువు లు, కుంటలు, నాలాల పరి రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలె క్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయ్ అధి కారులను ఆదేశించారు.ఖిలా వరంగల్‌లోని గుండు చెరువు వద్ద శుక్రవారం నిర్వహించిన చెరువుల పరిరక్షణ కమిటీ సమావే శంలో చెరువులు, కుంట లు, నాలాల ప్రస్తుత పరి స్థితి, పరిరక్షణ చర్యలపై వివిధ శాఖల అధికారుల తో సమీక్షించారు.చెరువు లు, కుంటలు, నాలాలను నోటి ఫై చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, ఎఫ్‌టీఎల్ మార్కింగ్‌తో పాటు చెరువు శిఖాలు ఆక్రమణలకు గురికాకుం డా క్షేత్రస్థాయిలో గుర్తించి పరిరక్షించాలని సూచిం చారు. ప్రతి నాలాకు ఇరిగే షన్ అధికారులు ఫీల్డ్ రిపోర్టు అందజేయాలని, నాలా కన్వర్షన్ సమయం లో అధికారులు క్షేత్రస్థాయి లో పరిశీలన చేయాలని ఆదేశించారు.సమావేశంలో డీసీపీ దార కవిత, డీఎఫ్ఓ బి.నిఖిత, కుడా అధికారులు, డీఆర్వో విజయలక్ష్మి , ఆర్డీవో సుమ, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగంకు సన్మానం



**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన నందిపేట్ మండల సర్పంచ్‌ల ఫోరం అ ధ్యక్షులు, న ందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం ని నందిపేట్ మండల తహసీల్దార్,ఎంపీడీవో తో పాటు నందిపేట్ మండల సర్పంచ్‌లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మీనారాయణ,దేవేందర్, సాయినాథ్,చిన్నయ్య,మహేష్,సుష్మ తదితర సర్పంచ్‌లతో పాటు మహిళా సర్పంచ్‌లు పాల్గొని ఎర్రం లింగం కి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం కార్యదర్శిగా ఎర్రం లింగం మరిన్ని సేవలు అందిస్తూ సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్ఐ మృతి





**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** శుక్రవారం ఉదయం నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ యందు ఎన్.ఎస్.ఓ (నైట్ సెక్యూరిటీ ఆఫీసర్)డ్యూటీ ముగించుకొని వచ్చిన తర్వాత ఉదయం సమయంలో ఆయుధం క్లీన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మిస్ఫైర్ కావడం వలన రిజర్వ్ ఇన్స్పెక్టర్ హెచ్.సతీష్ (41) మరణించడం జరిగింది.ఇట్టి సంఘటన స్థలాన్ని హుటాహుటిన నిజామాబాదు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షించారు.నిజామాబాదు ప్రభుత్వ హాస్పిటల్ లో పోస్టుమార్టం అనంతరం పోలీస్ కమీషనర్ పుష్ప గుచ్చలు ఉంచి ఘనంగా నివాళులుఅర్పించారు.ఈ సందర్భంగా నివాళులు అర్పించిన వారిలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్,నిజామాబాదు ఏసిపి ప్రకాష్,ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర్ రెడ్డి,బోధన్ ఎసిపి శ్రీనివాసులు,ఏ.ఆర్ ఏసిపి కృష్ణ స్వామి,సి.సి.ఎస్ ఏసిపి శ్రీశైలం,టాస్క్ ఫోర్స్ ఎసిపి నరేందర్,సి.టి.సి ఎసిపి రాజశేఖర్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి,మల్లేశం,సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు,ఎస్ఐ లు,ఆర్ఎస్ఐలు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీను,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.నివాళుల అనంతరము ప్రత్యేక అంబులెన్స్ లో తన స్వస్థలం అయినటువంటి ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలంకు తరలించారు.

## వినాయక మండపాల వద్ద నిబంధనలు పాటించాలి:నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ.

**నాగోల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**

నాగోల్ వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నాగోల్ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లోని వినాయక మండపాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ నియంత్రణ, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రజలకు సూచనలు చేస్తున్నారు.ఈ సందర్భంగా సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మండపాల వద్ద మహిళలు, బాలికలను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ ఇవ్వవద్దని సూచించారు.రోడ్డు భద్రతపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయవద్దని సూచించారు. మండపాల వద్ద వాహనాలను రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరిస్తే వినాయక వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించవచ్చని బండ్లగూడా




లోని రాజీవ్ సహాభావన అపార్ట్మెంట్స్ మరియు తట్టి అన్నారం లోని అన్నవరపు సత్య నారాయణ కాలనీ నందు నిర్వహించిన కార్యక్రమం లో నాగోల్ సీఐ మక్బూల్ జానీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లారెడ్డి, ట్రాఫిక్ హెచ్‌సి నర్సింహ సి దశరథ, ఎస్సై సూర్య, ఎస్‌జిహెచ్ సహచారి లక్ష్మి కవిత పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పులకు తావివ్వొద్దు

- **నోటీసుల విచారణ, ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశం**



**మేడ్చల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల విచారణ, ధ్రువపత్రాల పరిశీలన, నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులపై నిర్వహిస్తున్న విచారణను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటు హక్కును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం సూచించిన ధ్రువీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయిలో ఓటర్లకు అందిస్తున్న సహాయం, రికార్డుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరైనప్పుడు వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అవసరమైన ఆధారాలను పూర్తిస్థాయిలో ధ్రువీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.జిల్లాలో మ్యాపింగ్ జరగని ఓటర్లు, ఓటరు గుర్తింపు కార్డుల్లో ఉన్న వ్యత్యాసాలకు సంబంధించిన దరఖాస్తులు, రికార్డుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.నిర్దేశిత గడువు లోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని చెప్పారు. విచారణ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాల్లో పారదర్శకత, నిబంధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.విచారణ సందర్భంగా ఓటర్ల నుంచి సేకరిస్తున్న వివరాలు, సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లు, కంప్యూటర్లలో ధ్రువపత్రాల నమోదు ప్రక్రియను సుదర్శన్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. ప్రక్రియలో ఎక్కడైనా లోపాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ ఫూల్‌సింగ్, ఉప కమిషనర్, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్ వజీర్

- **పదవి లేకున్నా సేవ ఆగలేదు**
- **కలకోట పాఠశాల విద్యార్థులకు స్టీల్ గ్లాసులు అందించిన మాజీ సర్పంచ్ ఎస్.కె. వజీర్**



**బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**

చిన్నారుల సంక్షేమం కోసం తనవంతు సహాయం అందించాలనే తపన.. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వస్తువులను సొంత ఖర్చుతో సమకూర్చడం.. చేసిన సేవకు ప్రచారం కోరుకోకుండా ముందుకు సాగడం.. రావినూతల మాజీ సర్పంచ్ షేక్ వజీర్ సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. పదవిలో ఉన్న సమయంలోనే కాకుండా పదవి ముగిసిన తర్వాత కూడా విద్యార్థుల అవసరాలను గుర్తించి తనవంతు సహకారం అందిస్తున్నారు.మండలంలోని కలకోట గ్రామంలోని ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 65 స్టీల్ గ్లాసులను విద్యార్థులకు అందజేశారు. ప్రీ–ప్రైమరీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అల్పాహార సమయంలో రాగిజావ, పాలు తీసుకునేందుకు వీలుగా ఈ గ్లాసులను అందించారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి సొంత ఖర్చుతో గ్లాసులు అందించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు వజీర్‌ను అభినందించారు.చిన్నారులంటే ప్రత్యేక అభిమానం ఎస్.కె. వజీర్‌కు చిన్నారులంటే ప్రత్యేక అభిమానం ఉందని స్థానికులు తెలిపారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తనకు సంతృప్తినిస్తుందని ఆయన చెబుతుంటారని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు కోరినప్పుడు స్పందిస్తూ వాలీబాల్, బంతులు, బ్యాడ్మింటన్ తదితర క్రీడా సామగ్రిని కూడా అందిస్తున్నారని తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ, పాలు అందించే సమయంలో ఇబ్బందులు లేకుండా గ్లాసులు, ప్లేట్లు తదితర సామగ్రిని సొంత ఖర్చుతో అందిస్తున్నారని చెప్పారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల అవసరాలను తెలుసుకుని, తనకు సాధ్యమైన సహాయం చేయడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ప్రచారం కాదు.. సేవే ముఖ్యంసామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినా వాటిని ప్రచారం చేసుకోవడానికి ఎస్.కె. వజీర్ ఆసక్తి చూపరని స్థానికులు తెలిపారు. “సహాయం చేయడం మన బాధ్యత.. దానికి ప్రచారం అవసరం లేదు” అనే భావనతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని చెప్పారు.రాజకీయ పదవి ఉన్నప్పుడే కాకుండా మాజీ సర్పంచ్‌గా బాధ్యతలు ముగిసిన తర్వాత కూడా ప్రజలకు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు తనవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే చిన్న సహాయం కూడా వారి దైనందిన జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఘనంగా సన్మానంఈ కార్యక్రమానికి ఎంఈఓ దామాల పుల్లయ్య, కలకోట కాంప్లెక్స్ హెచ్‌ఎం దాసరి సునీల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు ప్రీతి, అంజమ్మ, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎస్.కె. వజీర్‌ను ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ దామాల పుల్లయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి దాతలు అందించే సహకారం ఎంతో విలువైనదని అన్నారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి సొంత ఖర్చుతో 65 స్టీల్ గ్లాసులు అందించిన ఎస్.కె. వజీర్‌ను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో మరింత బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు.పదవి ఉన్నా లేకున్నా.. విద్యార్థుల అవసరాల కోసం ముందుకు వస్తూ సేవ చేయడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు కొనియాడారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన

- చిన్నంబావి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**నాగర్ కర్నూల్ , సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కొల్లాపూర్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతి చెందడంతో కొల్లాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.x చిన్నంబావి మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గజ్జె ఈదన్న యాదవ్, చెల్లెపాడు సర్పంచ్ పెద్ద నరసింహ, చిన్న మారూర్ సర్పంచు మద్దూరి శంకర్, కాలూరు సర్పంచు చిన్నంబావి మండల సీనియర్ నాయకులు వడ్డేమాన్ రామకృష్ణ, తగరం ఆటో కుర్మయ్య, మాజీ ఎంపీటీసీ తగరం లక్ష్మీ కురుమయ్య, మాజీ ఉపసర్పంచ్ ఆనంద్ యాదవ్, సీనియర్ నాయకులు, సంకటి మద్దిలేటి, అయ్యవారిపల్లి స్వామి, టీచర్ రిటైర్డ్ ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనంత జయగౌడ్, చిదంబ రెడ్డి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. తమతో సన్నిహితంగా ఉన్న కుటుంబంలో జరిగిన ఈ విషాదం పట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.“ఆప్తుడిని కోల్పోవడం తీరని లోటు”బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ తీరని లోటు. ఈ విషాద సమయంలో బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం అంటూ పరామర్శకు వచ్చిన నాయకులు తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ అంతిమ యాత్రలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు రంగినేని అభిలాష్ రావు, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఉమ్మడి







మహబూబ్ నగర్ తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు కొల్లాపూర్ నియోజక వర్గ సీనియర్ నాయకులు తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో కొల్లాపూర్‌లో విషాద వాతావరణం నెలకొంది. బీరం లక్ష్మారెడ్డి భౌతికకాయాన్ని చివరి సారిగా దర్శించుకున్న నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అంతిమక్రియల్లో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

# వినాయక మండపాలను సందర్శించిన
## మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి

- అనంతగిరిపల్లిలో గణనాథుడికి ప్రత్యేక పూజలు

**వికారాబాద్ , సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వికారాబాద్: పట్టణంలోని వార్డు నంబర్ 10 అనంతగిరిపల్లిలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీజేఎంయూ గౌరవ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మండపాల నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించిన సుధాకర్ రెడ్డి, మండపాల నిర్వాహకులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతగిరిపల్లిలో భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడికి పూజలు



నిర్వహించారు.కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్యా నాయక్, మాజీ కౌన్సిలర్ మురళి బాలరాజ్, నంది అంజయ్య, వార్డు సభ్యులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# హై కోర్టు తీర్పు కాంగ్రెస్ కు చెంపపెట్టు

- దానం నాగేందర్ పై అనర్హత వేటును స్వాగతిస్తున్నాం
- సీఎం రేవంత్ రెడ్డి ఫిరాయింపు రాజకీయాలకు హైకోర్టు బ్రేకులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ టికెట్ పై ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు వేస్తూ హై కోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ కు చెంపపెట్టు అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అభివర్ణించారు.దానం నాగేందర్ పై అనర్హత వేటును స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఫిరాయింపు రాజకీయాలకు హైకోర్టు బ్రేకులు వేసిందని ఆయన గుర్తు చేస్తూ ఇకనైనా కాంగ్రెస్ ఫిరాయింపులను ప్రోత్సహించకుండా స్వీయ నియంత్రణ పాటించాలని హితవు పలికారు.ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు పడటం గొప్ప ప్రజాస్వామిక విజయంగా జీవన్ రెడ్డి పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు ఇది గొడ్డలి పెట్టు అని ఆయన ఎద్దేవా చేశారు.ఇది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో గులాబీ ఎమ్మెల్యేలు సాధించిన ఘన విజయంగా ఆయన స్పష్టం చేశారు.ఈ అంశంపై రెండున్నరేళ్లుగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి లభించిన ఫలితం అని ఆయన అన్నారు.ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేమని రేవంత్




రెడ్డి కి న్యాయస్థానం తీర్పు తత్వం బోధపడి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.దానం నాగేందర్ లాగే పార్టీ మారిన మిగతా ఎనిమిది మంది పై కూడా అనర్హత వేటు పడటం ఖాయమన్న ఆశాభావాన్ని జీవన్ రెడ్డి వ్యక్తం చేశారు.

# శ్రీ గౌతమేశ్వరాలయ చైర్మన్ గా గుండా రాజు నియామకం

**మంథని, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మంథని పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గౌతమేశ్వరాలయ చైర్మన్ గా గుండా రాజును నియమిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. శ్రీ గౌతమేశ్వరాలయ చైర్మన్ గా తనను నియమించడం పట్ల గుండారాజు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీనుబాబు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తన ఎన్నికకు సహకరించిన మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మంథని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, బోయినిపేట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం తన వంతు కృషి చేస్తాననీ, ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఈ సందర్భంగా గుండారాజు తెలిపారు.



# ఎర్రయిగూడెంలో గణపతి యూత్ ఆధ్వర్యంలో గణనాధునికి ఘనంగా పూజ లు

**ఇల్లందు, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం ఎర్రాయి గూడెం గ్రామపంచాయతీ ఎర్రాయి గూడెం గ్రామంలో గణపతి యూత్ ఆధ్వర్యంలో విజయ్ అయ్యగారు పూజ కార్యక్రమం చేపట్టారు గణనాధునికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు నైవేద్యం సమర్పించి పండ్లు పలహారాలు సమర్పించారు భక్తులు వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో పాటలు భజన కార్యక్రమాలు కోలాటాలు నిర్వహించారు గణనాధుని ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గణనాధుని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో పూజారులు మహిళలు గ్రామ యువకులు పాల్గొన్నారు



# గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

**మంథని, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మంథని పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం భవన్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ను రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యంగా గూడ్స్ వాహనం నడిపి బైక్‌ను ఢీకొట్టిన డ్రైవర్‌పై కేసు

**హన్మకొండ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నిర్లక్ష్యంగా, అతివేగంగా టాటా గూడ్స్ వాహనం నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన డ్రైవర్‌పై హసన్ పర్తి పోలీసులు కేసు నమో దు చేశారు. పోలీసుల వివ రాల ప్రకారం.. ఎల్లాపూర్ గ్రామానికి చెందిన పొగాకు సాయినాథ్ (24) గత ఆగ స్టు 22న తన తమ్ముడు సన్నీ (16)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్లాపూర్ నుంచి హసన్‌పర్తి వైపు వెళ్తుండగా, హసన్‌పర్తి పెట్రోల్ బంక్ సమీపంలో హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న టాటా గూడ్స్ వాహనం ఒక్కసారిగా కుడివైపునకు మళ్లి వారి బైక్‌ను ఢీ.. కొట్టింది.ఈ ప్రమాదంలో సాయినాథ్ తలకు, ఎడమ కంటికి, ఎడమ చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఎంజీ ఎం ఆసుపత్రికి తరలించ గా, ఎడమకంటికి తీవ్ర గాయం కావడంతో దృష్టి కోల్పోయాడు. అనంతరం గార్డియన్ ఆసుపత్రి, ఎల్. వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి లో చికిత్స పొందాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి ప్రమాదానికి కారణమైన టాటా గూడ్స్ వాహనం TG-02-T-4640గా, డ్రైవర్‌ను గుఫ్రాన్గా గుర్తిం చారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు హసన్ పర్తి పోలీసులు తెలిపారు.

# మహాగణనాథుని దర్శించుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్ నగర్ డివిజన్‌లోని శ్రీనివాస కాలనీ, లెక్చరర్స్ కాలనీ డివిజన్ లోని మరియు BMS యాదవ్ నగర్ కాలనీలలో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన మహాగణనాథుని మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్న హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.ఈ సందర్భంగా ఆయా కాలనీలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, గణనాథుని ఆశీస్సులు పొందారు.అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.ఈ సందర్భంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో జీవన్ అన్న మిత్రమా సభ్యులు పాండల శ్రీధర్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్ మరియు తదితరులు పాల్గొన్నారు.





## పినపాక, కరకగూడెం క్రీడాకారులకు జోనల్ స్థాయి పోటీలు



**పినపాక, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో పినపాక జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య తెలిపారు.ఈ నెల 19న ఏడుళ్ళ బయ్యారం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరగనున్నాయి. ఇందులో పినపాక కరకగూడెం మండలాల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని ఆయన స్పష్టం చేశారు.పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. కావున సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికైన క్రీడాకారులతో నిర్ణీత సమయానికి హాజరై పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ కొమరం నాగయ్య కోరారు.

## సైడ్ కాలవ మీద సొంత ఖర్చులతో స్లాబ్ ఏపించిన సర్పంచ్





**ఇల్లందు, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం ఎర్రాయిగూడెం గ్రామం ఇటీవల నిర్మించిన సైడ్ డ్రైనేజ్ కారణంగా ఎర్రాయిగూడెం నుండి మొక్కంపాడు వెళ్లే రహదారి మార్గం ఇటీవల కాలవ దాటుతుండగా ఆవులు మేకలు కాలువలో పడి గాయాలు అయ్యాయి.చేను పనులకు వెళ్లే మార్గంలో ఆ రైతుల ఇబ్బందులు గురించి సర్పంచికి తెలియజేయగా వెంటనే స్పందించి సర్పంచ్ సొంత ఖర్చులతో సైడ్ డ్రైనేజ్ మీద స్లాబ్ వేయించారు ఇది చూసిన ఆ గ్రామ రైతులు పెద్దలు సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు ఇందులో భాగంగా స్వచ్ఛ భారత్ భాగంగా రోడ్డుకు ఇరువైపులా గడ్డిని డోజర్ ట్రాక్టర్ సహాయంతో చదును చేపించడం జరిగింది

## తిరుపతి సిమెంట్ బ్రిక్స్ బ్రాహ్మణపల్లికి తరలింపు



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తొర్రుర్ రాందాస్ పల్లి లో గల తిరుపతి సిమెంట్ బ్రిక్స్ టెడ్రింగ్ ను 274 బ్రహ్మణపల్లి తుర్కయాంజల్ కు మార్చబడదని ప్రోపేటర్ కుర్ర తిరుపతి అన్నారు. వినియోగదారులు గ్రహించి కొత్తగా ఏర్పాటు చేసిన బ్రిక్స్ ట్రేడింగ్ కు రావాలని కోరారు. గత మూడు సంవత్సరాల నుంచి వినియోగదారులకు మంచి సేవలు అందిస్తూ ముందుకు పోతున్న తమ ట్రేడింగ్ ను అందరూ ఆదరించాలని కుర్ర తిరుపతి పేర్కొన్నారు. వినియోగదారులకు మంచి సరసమైన ధరల్లో సేవలు అందించడం జరుగు

# ప్రజలకు వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- **పల్లె దవాఖానాల సేవలపై సమీక్షలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ హెచ్చరిక**





**మేడ్చల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** పల్లె దవాఖానాల ద్వారా ప్రజలకు అందించే ప్రాథమిక వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించినా, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయకపోయినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పల్లె దవాఖానా పరిధిలోని ప్రజలకు అందాల్సిన వైద్య సేవలకు సంబంధిత వైద్యాధికారులే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.అంటాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం మొదటి అంతస్తులోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో పల్లె దవాఖానాల వైద్యాధికారులు, నివేదికల పర్యవేక్షకులతో డా. కె. ఆనంద్ కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరు డివిజన్ల ఉప జిల్లా వైద్యాధికారులు, జిల్లా కార్యక్రమాల అధికారులు, పల్లె దవాఖానాల వైద్యాధికారులు, నివేదికల పర్యవేక్షకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. ఆనంద్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో పల్లె దవాఖానాలు కీలకమని తెలిపారు. ప్రతి కేంద్రంలో ప్రజలకు అవసరమైన వైద్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్యాధికారులు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధగర్భిణీలను ప్రారంభ దశలోనే గుర్తించి నమోదు చేయడంతో పాటు, గర్భధారణ సమయంలో నిర్వహించాల్సిన పరీక్షలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన టీకాలు, పోషకాహార సప్లిమెంట్లు అందించాలని తెలిపారు. ప్రసవానంతర సేవలు అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో తరలించాలని ఆదేశించారు.నవజాత శిశువులు, శిశువులు, పిల్లల్లో జన్యుపరమైన లోపాలు, పోషకాహార లోపాలను ముందుగానే గుర్తించి తగిన వైద్యం, తదుపరి వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు.సాధారణ వ్యాధులకు స్థానికంగానే వైద్యంజ్వరం, విరేచనాలు, నీటి ద్వారా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, టైఫాయిడ్, చర్మ సంబంధిత సమస్యలు తదితర సాధారణ అనారోగ్యాలకు పల్లె దవాఖాన స్థాయిలోనే అవసరమైన వైద్యం అందించాలని డా. ఆనంద్ తెలిపారు. తీవ్రత కలిగిన కేసులను గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. క్షయ నియంత్రణలో ప్రత్యక్ష పర్యవేక్షణ సేవలు, కుష్ఠు వ్యాధి నియంత్రణలో వికలాంగత నివారణ, నిర్వహణ సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.అసాంక్రమిక వ్యాధులపై నిరంతర పర్యవేక్షణమధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ తదితర అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు పరీక్షలను నిరంతరం నిర్వహించాలని చెప్పారు. వ్యాధులు గుర్తించిన వారికి చికిత్స అందించడంతో పాటు తదుపరి పర్యవేక్షణ, మందుల వినియోగం, చికిత్స కొనసాగింపును పర్యవేక్షించాలని సూచించారు. కిశోర బాలబాలికలకు ఆరోగ్య సలహాలు, పోషకాహార లోపాల గుర్తింపు, అవసరమైన వైద్యం, ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించే సేవలను అందించాలని తెలిపారు.మౌలిక వసతులపై దృష్టిపల్లె దవాఖానాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని డా. ఆనంద్ అన్నారు. అవసరమైన జన ఆరోగ్య సమితి నిధులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందుబాటులో ఉన్న నిధులను ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.రికార్డుల నమోదు లోనూ అలసత్వం వద్దుప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఆరోగ్య కార్యక్రమం క్షేత్ర స్థాయిలో విజయవంతం కావడంలో పల్లె దవాఖానాల వైద్యాధికారుల పాత్ర కీలకమని డా. ఆనంద్ పేర్కొన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించడంతో పాటు కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రికార్డులు, అంతర్జాల ఆధారిత వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు."విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో అలసత్వం ప్రదర్శించినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవు. ప్రజలకు అందాల్సిన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించేది లేదు. ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ప్రజలకు అందించే ఆరోగ్య సేవలకు పూర్తి బాధ్యత వహిస్తూ పనిచేయాలి" అని డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.

# బోర్గం పి లో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్



**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** శుక్రవారం జిల్లా విద్యాశాఖ నిజామాబాద్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పిహెచ్ఎస్ బోర్గం పి పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించడం జరిగింది.ఈ సైన్స్ సెమినార్ నందు ఈనెల 16న వివిధ మండలాలలో గెలుపొందిన మొదటి బహుమతి పొందిన విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ లో పాల్గొనడం జరిగిందని జిల్లా సైన్స్ అధికారి కె.గంగా కిషన్ తెలియజేసినారు.ప్రతి సంవత్సరం విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నరూ.ఈ సంవత్సరం" ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ – ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్" అను ప్రధాన అంశంలో నిర్వహించడం జరిగింది.నిజామాబాద్ జిల్లా నుంచి ప్రతి సంవత్సరం దక్షిణ భారత స్థాయికి సైన్స్ సెమినార్ సెలెక్ట్ కావడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణయితలు సిహెచ్.ముద్దుకృష్ణ,బి.సాయి బాబా,రఘునాథ్,గోవర్ధన్,కాంతారావు వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు,వారి గైడ్ టీచర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిన ఐదుగురికి మెమొంటోలు,పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లతో బహుకరించడం జరిగింది.ఈ సందర్భంగా సైన్స్ అధికారి మాట్లాడుతూ....పర్యావరణాన్ని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకొనవలెనని భవిష్యత్ లో 2047 నాటికి క్లీన్ ఎనర్జీ,గ్రీన్ ఎనర్జీ ప్రధానాంశాలుగా ముందుకు కదులుతూ నూతన ఆవిష్కరణలు సాధించవలేనని తెలిపినారు.మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థి ఈ నెల 29న ఎస్ సి ఈ ఆర్ టి హైదరాబాద్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ లో పాల్గొంటారని,అక్కడ గెలుపొందిన ఒకరు దక్షిణ భారత స్థాయికి ఎంపిక అవుతారని తెలిపినారు.మొదటి స్థానంలో ఏ.అక్షయ కేజీబీవీ సౌత్ నిజామాబాద్,రెండవ స్థానంలో Nizba taisin wisdom hs nzb,మూడవ స్థానంలో జి.కీర్తన టిజిఎంఎస్ ఆర్మూర్,నాలుగవ స్థానంలో పి.అక్షర విజ్ఞాన్ హై స్కూల్ ముప్కాల్,ఫిర్దోస్ మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ వర్ని,జి.అక్షర జెడ్పిహెచ్ఎస్ చల్లగర్గ లు గెలుపొందారు.

# పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ 19 లక్షల జిల్లా పరిషత్ నిధులు విడుదల : ఎంపీడీవో సంకీర్త్



**పినపాక, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి రూ 19 లక్షల నిధులు మంజూరైనట్లు పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సంకీర్త్ వెల్లడించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆస్పత్రిలోని మౌలిక సదుపాయాలు, వైద్య సేవల తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మంజూరైన రూ.19 లక్షల జిల్లా పరిషత్ నిధులతో ఆరోగ్య కేంద్రంలో అత్యంత ముఖ్యమైన మౌలిక వసతులు, కావలసిన మెడికల్ మెటీరియల్ సేకరించనున్నట్లు తెలిపారు. నిధుల కేటాయింపు, ఆస్పత్రికి తక్షణమే కావాల్సిన అవసరాలపై మెడికల్ ఆఫీసర్‌తో ప్రత్యేకంగా చర్చించారు.ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన ప్రధాన అవసరాలు:ప్రత్యేక షెడ్ నిర్మాణం: అత్యవసర కేసులు, రోడ్డు ప్రమాద బాధితులు, పాయిజన్, కేసులకు తక్షణ ప్రథమ చికిత్స అందించడానికి వీలుగా ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేయాలని మెడికల్ ఆఫీసర్ కోరారు.వైద్య పరికరాలు: రక్త పరీక్షలకు సంబంధించిన ఆధునిక పరికరాలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.తాగునీటి సదుపాయం: ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు ఇబ్బంది కలగకుండా స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని వివరించారు.వైద్యులు కోరిన సదుపాయాలన్నింటినీ ఈ నిధుల ద్వారా త్వరలోనే ఏర్పాటు చేసి, ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) వెంకటేశ్వర్లు, పినపాక సర్పంచ్ అలివేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయకుని ముందు విజ్ఞాన కార్యక్రమం

**ఖమ్మం, బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వినాయక చవితి సందర్భంగా పల్లెప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో అంబేద్కర్ సెంటర్లో వినాయక విగ్రహం వద్ద గురువారం రాత్రి క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ బహుమతులను నగదు రూపంలో పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు, సభ్యులు కొండేటి అప్పారావులు అందజేశారు. గ్రామంలో మూడు సెంటర్ లలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తుండగా అంబేద్కర్ సెంటర్లో పిల్లలు వినాయక విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పల్లెప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. ప్రథమ బహుమతిని బోయినపల్లి ఆశ్లేష్ టీమ్, ద్వితీయ బహుమతిని నంజాల ఉత్తేజ్ టీమ్ గెలుపొందారు. వినాయక చవితిని సాంప్రదాయ బద్ధంగా, ప్రకృతి, పర్యావరణాన్ని కలుషితం చేయకుండా జరుపుకోవాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు కోరారు. మనిషిలోని అష్ట అవలక్షణాలను పోగొట్టుకునేందుకు విఘ్నేశ్వరుని పూజించాలని నేడు కార్పోరేట్ కల్చర్ తో వినాయకచవితి సందర్భంగా మన సంస్కృతి సాంప్రదాయాలకు విరుద్ధంగా అనేక అవలక్షణాలు కనిపిస్తుండడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు, కొండేటి అప్పారావు, సిపిఎం రెండవ శాఖా కార్యదర్శి బోయినపల్లి పున్నయ్య, బోయినపల్లి లక్ష్మి , వాణి, బాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం నగరంలో ఘనంగా శ్రీ సిద్ధి వినాయక ఉత్సవాలు





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నగరంలోని 55వ డివిజన్లో శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజ, అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మ హిళ లు ప్రత్యేకంగా కుంకుమ పూజలో పాల్గొని శ్రీ సిద్ధి వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సిద్ధి వినాయకుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అన్నప్రసాద దాత సాదినేని భాస్కర్‌రావు, అన్నపూర్ణ దంపతులు, కుంకుమ పూజ దాత వంగల నరసింహ, స్వరూప్ శ్రీ వాణి దంపతులు సహకరించారు. వీర కృష్ణా, మధు, శ్రీనివాస్, శేఖర్ ,నారాయణ రావు, శ్రీను మరియు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.సహకరించినవారికి మాజీ కార్పొరేటర్ మోతరపు శ్రావణి సుధాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **హెచ్ఐవి రహిత జిల్లాగా ఖమ్మం ను తీర్చిదిద్దాలి**
- **ఎస్ఆర్&బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్**




**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్ఆర్&బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, లింక్ వర్కర్లు తదితరులు హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు అవగాహన, జాగ్రత్తలు, బాధ్యతాయుతమైన ఆరోగ్య అలవాట్లు ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా యువతలో ఎయిడ్స్ పై శాస్త్రీయమైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎయిడ్స్ తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారికి సామాజిక మద్దతు అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా హెచ్ఐవి నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు, అధిక ప్రమాదానికి లోనయ్యే వర్గాల్లో అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎచ్ఐవి ఎలా వ్యాప్తి చెందుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి నిర్ధారణ, చికిత్స, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జానపద కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కథన విధానం 'పల్లె సుద్దులు' ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్స మరియు వివక్ష నిర్మూలనపై యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డాక్టర్ రామారావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వేణు మాధవ్, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ అండ్ లెప్రసి) డాక్టర్ ఎల్. ప్రవీణ, ఎస్ఆర్ అండ్ బిజివిన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ జాకీరుల్లా, ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. చెంచు రత్నయ్య, ఐక్యూఎసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సునంద, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం అధికారులు, సిబ్బంది, కె.సి. పుల్లయ్య స్వచ్ఛంద సేవా సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవా సిబ్బంది, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సేవా సిబ్బంది, ఎ. శంకర్, అప్పా ప్రెసిడెంట్, డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్ కు చేరుకున్న ఖమ్మం అర్బన్ మండల బాలికల క్రీడలు





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల న్యూ విజన్ పాఠశాల క్రీడ మైదానంలో శుక్రవారం ఖమ్మం అర్బన్ మండల్ నార్త్ లెవెల్ గేమ్స్ మీట్ లో బాలికల అండర్ 14, 17 క్రీడలను ఎంఈఓ శైలజా లక్ష్మి , కన్వీనర్ ఎండి అబుద్ అలీ ప్రారంభించారని ఎస్ జి ఎఫ్ మండల కార్యదర్శి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఖమ్మం అర్బన్ మండలం నార్త్ లేవల్లోని ప్రభుత్వ ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినీలు అండర్ 14, 17 , బాలుర కబడ్డీ కోకో వాలీబాల్ మొత్తం 106 టీములకు గాను 848 మంది విద్యార్థులు పాల్గొనడం క్రీడా స్ఫూర్తి కి నిదర్శనంగా జిల్లా స్థాయి క్రీడలకు మించి క్రీడల్లో పాల్గొనుటకు వచ్చిన బాలికలకు శుభాకాంక్షలు తెలియజేసి, గెలుకోటములని స్పోర్టివ్ గా తీసుకోవాలని వారు సూచించారు. అండర్ 14 వాలీబాల్ ఫైనల్ కు బ్లూమింగ్ మైండ్, గోర్కె స్కూల్ అండర్ 17 ఇయర్స్ వాలీబాల్ ఫైనల్స్ బ్లూమింగ్ మైండ్ వర్సెస్ టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ టేకులపల్లి ఫైనల్ కి చేరుకున్నాయి, 14 ఇయర్స్ కోకో న్యూ విజన్ బ్లూమింగ్ మైండ్, పాండురంగాపురం టిజిఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ డైట్ కోర్కె స్కూల్ మైండ్ సెమి ఫైనల్ కు చేరుకున్నాయి, అండర్ 17 ఇయర్స్ గర్ల్స్ కోకో, ఈగ్నెట్ టేకులపల్లి, ఎస్ ఎఫ్ ఎస్ బ్లూమింగ్ మైండ్లు రోటరీ నగర్, బరిలో నిలిచి ఉన్నాయి, కబడ్డీ అండర్ 14 ఇయర్స్ గర్ల్స్ జడ్పిహెచ్ఎస్ మల్లెమడుగు ఇగ్నైట్, టేకులపల్లి కోర్కె సెమీఫైనల్కు చేరుకున్నాయి 19-9- 2026 బాయ్స్ అండ్ గర్ల్స్ ఫైనల్స్ నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు. మండల కమిటీ సభ్యులు నాగుల్ మీర , రాము నాగ ప్రసాద్ , రోజ, సంపత్ కుమార్, విజయ కుమారి, మరియు పిడి పిఇటిలు నాగేశ్వరరావు, నరసయ్య కోకో నేషనల్ రేఫరి, సత్యనారాయణ కబడ్డీ నేషనల్ రేపరీ, ఆర్గనైజింగ్ పిడీలు సంపత్ కుమార్, వెంకటేశ్వర్లు, శంకర్, తులసీ, ప్రైవేట్ స్కూలు పిఈటి ,పి డి లు పూర్తి సహకారం అందించి టోర్నమెంట్ విజయం కావడానికి సహకారం అందించారని సెక్రటరీ బి కృష్ణయ్య తెలియజేశారు..

# పిఆర్సీని వెంటనే అమలు చేయాలి

- **సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి**
- **పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి**




**ఖమ్మం, కూసుమంచి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే పీఆర్సీని అమలు చేస్తామని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు పీఆర్సీ అమలు చేయకపోవడం, సీపీఎస్‌ను రద్దు చేయకపోవడం పట్ల పిఆర్టియు టీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ కట్టా శేఖర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.కూసుమంచిలో జరిగిన పిఆర్టియు టీఎస్ కూసుమంచి మండల శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీఆర్సీ అమలు ఆలస్యం కావడం, సీపీఎస్ కొనసాగడం, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు విడుదల కాకపోవడం వల్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఎన్నికల హామీలను నెరవేర్చి పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వంలో భాగస్వాములైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వంగా తన బాధ్యతను నెరవేర్చాలని కట్టా శేఖర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టీఎస్ కూసుమంచి మండల అధ్యక్షులు ఎస్. ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం. సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు, పిఆర్టియు మాసపత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యులు జి. వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.వి. కృష్ణారావు, సాదె వెంకన్న, రాజశేఖర్, మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శులు ఏ. లక్ష్మీనారాయణ, కె. అనంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పి. శోభన్ బాబు, సర్వర్ మియా, కృష్ణ, పాపారావు, కృష్ణవేణి, విజయ, రూపిణి, రవళి, చైతన్య, రాజ్యలక్ష్మి తదితరులు, పిఆర్టియు సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని కలిసి ఆయిల్ ఫామ్ సమస్యలపై వినత పత్రం అందజేసిన ఆలపాటి, నల్లమల్ల వెంకటేశ్వరరావు

**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** హైదరాబాదులో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని కలిసి ఆయిల్ ఫామ్ రైతు సమస్యలు మినిమం గ్యారంటీ ధరపై వినపత్రం అందజేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నల్లమల్ల వెంకటేశ్వరరావు (ఎన్.వి) వినత పత్రం అందజేశారు. దక్షిణాది రాష్ట్రాల రైతాంగ సమస్యలు, ఆయిల్ ఫామ్ రైతు సమస్యలపై మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో శుక్రవారం హైదరాబాదులో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ముందుగానే ఆలపాటి ప్రసాద్, ఎన్.వి, మంత్రి తుమ్మల సమక్షంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని కలిసి తెలంగాణ లోని ఆయిల్ ఫామ్ పరిస్థితి, సాగు విస్తీర్ణం పెంచే విధంగా తీసుకుంటున్న చర్యల తో పాటు ఆయిల్ ఫామ్ రైతుల సమస్యలను లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు.



# 14 వేలు లంచం తీసుకుంటు ఏసీబీ కి చిక్కిన హాస్టల్ వార్డెన్



**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఎస్ టి బాయ్స్ హాస్టల్ (ఐటి డి ఏ )చర్ల మండలం సత్య నారాయణపురం ఎస్టీ హాస్టల్ లో వర్కర్( కుక్) జీతం చేయడానికి వార్డెన్ భూక్యా వాల్ సింహ రూ 14 వేలు లంచం తీసుకుంటా ఏసీబీ కి చిక్కాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని కుక్ ఏసీబీ ని అశ్రయించారు. ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి శుక్రవారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మారు మూల ప్రాంతాల నుండి కూడా ఏసీబీ ఫిర్యాదులు అందుతున్నాయి. ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో విజయవంతం గా దాడులు చేసి పట్టుకుంటున్నారు.

# సీడ్స్ బాల్ ప్రోగ్రాం కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఒక్క లక్ష సీడ్స్ బాల్ ఫ్రోగ్రాం లో భాగంగా ఇంపాక్ట్ ఇంటర్ నేషనల్ వారి ఆధ్వర్యంలో ఇండియన్ కామన్ ఫార్మర్స్క్లబ్ వారు తేట్టెల పాడు గ్రామ మహిళా సర్పంచ్ డ్వాక్రా మహిళ లకు 500 సీడ్స్ బాల్స్ అందజేయడం జరిగింది. వారు మంచిగా స్పందించి, గ్రామ మహిళలు ప్రజలు ఇండియన్ కామన్ ఫార్మర్ ప్రెసిడెంట్ బొమ్మగాని నరసింహారావు ఆదర్శ రైతుని ఘనంగా గ్రామ సర్పంచ్ డ్వాక్రా మహిళలు సన్మానించారు.జడ్ పిహెచ్ ఎస్ తేట్టెలపాడు హైస్కూల్ లో విద్యార్థులకు కేరర్ గైడెన్స్, సీడ్ బాల్స్ ప్రాముఖ్యత గురించి మోటివేషన్ ఇవ్వడం జరిగింది. ఆ స్కూల్ కి 300 సీడ్ బాల్స్ పిల్లలతో తయారు చేపించడం జరిగింది. దీనిలో భాగంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. జడ్ పిహెచ్ ఎస్ పైనంపల్లి స్కూల్ నందు కేరిర్ గైడన్స సీడ్ బాల్స్ తయారు చేపించడం వాటి ఉపయోగాలు గురించి మోటివేషన్ ఇవ్వడం జరిగింది. వారికీ 250 సీడ్ బాల్స్ పిల్లలతో చేపించడం జరిగింది. మామకి నామ్ పిఏడిఓ గురించి అమ్మ పేరుమీద మొక్క నాటడం అనే ప్రత్యేకమైన అంశం గురించి చెప్పడం జరిగింది. హైస్కూల్ హెచ్ ఎం పార్ధసారధి, స్కూల్ ఉపాధ్యాయ బృందం విద్యార్థుల పాల్గొన్నారు. బీరోలు హైస్కూల్ హెచ్ ఎం వీరాస్వామి అధర్యంలో 200 మంది విద్యార్థులకు ప్రధానమంత్రి పీఎంసీ, హైస్కూల్ జల్లేపల్లి నందు 300 మంది విద్యార్థులకు కేరిర్ గుడ్న్స ఎల్ నినో ఎఫెక్ట్ వాటి నుండి మనం ఏ విధంగా సర్వ్ అవ్వాలి, సీడ్ బాల్స్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. హెచ్ ఎం పార్ధసారధి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన మోటివేషన్ సెమినార్ కీ సహకరించిన అందరికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# 46వ డివిజన్ శ్రీ బాల గణేష్ ఉత్సవ కమిటీ 21వ వార్షికోత్సవ మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న తోట దంపతులు





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలోని 46వ డివిజన్ జూబ్లిపుర ప్రాంతంలో శ్రీ బాల గణేష్ 21వ వార్షికోత్సవ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మహా అన్న ప్రసాద వితరణ కార్య క్రమంలో ముఖ్య అతిథు లుగా 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, రామారావు దంపతులు పాల్గొని గణనా ధుని దర్శనం చేసుకొని పూజలో పాల్గొని అన్న ప్రసాద వితరణ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ ఆధ్యాత్మికశోభను ఉద్దేశించి తోట దంపతులు మాట్లాడుతూ అన్ని పండుగలలో కంటే ఈ వినాయకచవితి అత్యంత ఆధ్యాత్మికంగా దైవ భక్తితో వాడవాడలా గణనాథుని ప్రతిష్టాపన చేసి తొమ్మిది రోజులు నవరాత్రి ఉత్సవాలు చేస్తూ భక్తి పరమయ్యే శుభప్రదమైన రోజులని గత 21 సంవత్సరాలుగా బాల ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత ప్రతిష్టాత్మకంగా గణనాథుని ప్రతిష్టాపన చేసి తొమ్మిది రోజులు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమ పూజ, సరస్వతీ పూజ, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారని. వారికి ఆ గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటు విఘ్నాలను తొలగించే వినాయకుడు ప్రజలందరికీ సుఖశాంతులు ఆయురారోగ్యాలు, సకల సంపదలు కలగ జేయాలని ఆ గణనాథుని వేడుకొని భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు చేతి శ్రీను, చేతి కృష్ణమోహన్, దండా శివరాం, శ్రీనాథ్, ఉపేందర్, హరికృష్ణ, సంతోష్, ధనుంజయ్, అశోక్, భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు చేయాలి

- పేరుకు ఒక మెనూ అమలు చేసేది మరొక మెనూ
- విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నగర కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు త్రినాథ్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పెడుతున్నటువంటి ఏజెన్సీలు ఎక్కడ కూడా మెనూ అమలు చేయడం లేదని పేరుకి ఒక మెనూ గోడ పైన అతికించి చూపిస్తూ వాళ్లకి ఇష్టం వచ్చిన కూరలను నీళ్ల చారును పెడుతూ విద్యార్థులను అనేక సమస్యలకు గురి చేస్తున్నారని ఈ ఘటన పైన ఎక్కడా కూడా ఎంఈఓ కానీ డీఈఓ కానీ స్పందించిన పరిస్థితి లేదని. వారి పెట్టేటువంటి నీలచారు ఇష్టానుసారంగా ఉండే టువంటి కూరలు తినలేక విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాక్సులు తెచ్చుకొని మరి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని చేస్తున్నారు. ఎక్కడ కూడా అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని పురుగులు వచ్చిన అన్నాని సైతం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఓటిస్తు న్నారని. టెండర్లు తీసుకుని నాసిరకమైన భోజనాన్ని పెడుతున్నటు వంటి ఏజెన్సీ నడుపుతున్న వారి పైన చర్యలు తీసుకోవాలని అధికా రులు నిర్లక్ష్య ధోరణి వీడి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన భోజనాన్ని విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలి యజేశారు. ఈ భోజనం పరిశీలన కార్యక్రమంలో డివిజన్ నాయకులు శ్యామ్, లోకేష్, భరత్, గణేష్,సందీప్,సుశాంత్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మంలో పొంగులేటికి మద్దతు ఎక్కడ?

- 22ఏ భూముల వివాదం విపక్షాల విమర్శలురాజీనామా డిమాండ్లు
- జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి బహిరంగ స్పందన కరవు
- రాజకీయ వర్గాల్లో చర్చ విపక్షాల ఆరోపణలు






**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతున్న 22ఏ నిషేధిత భూముల వ్యవహారం ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ చర్చనీ యాంశంగా మారింది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తూ రాజీనామా డిమాండ్లు తెరపైకి తీసుకొస్తున్న నేపథ్యంలో ఆయనకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఆశించిన స్థాయిలో బహిరంగ మద్దతు కనిపించకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో ప్రైవేటు ఆస్తులు, కాలనీలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా యంటూ విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. బీజేపీ నేతలు సైతం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అయితే మంత్రి పొంగులేటి మాత్రం 22ఏ జాబితా వ్యవహారం కొత్తగా తమ ప్రభుత్వం సృష్టించినది కాదని, గతంలోనూ అనేక భూములు ఈ జాబితాలో ఉన్నాయని అసెంబ్లీలో వివరించారు. తప్పుగా జాబితాలో చేరిన భూములను పరిశీలించి పరిష్కరిస్తామని కూడా ప్రభుత్వం చెబుతోంది. తాజాగా సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెవెన్యూ శాఖను నిర్వహి స్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కీలక రాజకీయ నేత. ఇలాంటి సమయంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సమిష్టిగా ఆయనకు అండగా నిలిచి 22ఏ అంశంపై ప్రభుత్వ వాదనను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు అలాంటి సమన్వయంతో కూడిన బహిరంగ రాజకీయ ప్రకటన పెద్దగా కనిపించకపోవడం చర్చకు దారితీస్తోంది.ప్రభుత్వ చర్యలపై ఆసక్తిఒకవైపు 22ఏ భూముల సమస్యకు పరిష్కారం చూపుతామని ప్రభుత్వం చెబుతుండగా మరోవైపు భూములు, ఆస్తుల విషయంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలు పూర్తిగా తొలగాల్సి ఉంది. మంత్రి పొంగులేటి కూడా అర్హులైన పట్టాదారులకు ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశం అసెంబ్లీ వరకు చేరడంతో పాటు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాగ్వాదానికి కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకత్వం ఎలాంటి వైఖరి తీసుకుంటుంది మంత్రులు, ఎమ్మెల్యేలు పొంగులేటికి బహిరంగంగా అండగా నిలుస్తారా లేక ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల కోసం వేచి చూస్తారా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికై జిల్లా కలెక్టర్‌ను కలిసిన బిఆర్ఎస్ బృందం

- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వినతి





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా కలెక్టర్ ని వారి కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ శాసనస భ్యులు సండ్ర వెంకట వీరయ్య కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిప త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైతాంగ సమస్యలు, ప్రజా సంక్షేమ పథకాలు మరియు మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల (ఎల్ 1, ఎల్ 2 కేటగిరీల) లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని నాయకులు తెలిపారు. అధికార పార్టీ క్యాంప్ కార్యాలయాల్లో రూపొందించిన అనధికారిక జాబితాలను ఎంక్వైరీలకు పంపిస్తూ స్థానిక సర్పంచుల హక్కులను, స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తిని కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ అనధికారిక జాబితాలను రద్దు చేసి, సర్పంచుల అధ్యక్షతన అధికా రికంగా గ్రామసభలు నిర్వహించి నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం, తల్లాడ మండలం పరిధి లోని సిరిపురం మేజర్ కాలువ ఆధునికీకరణ పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల సుమారు 11,000 ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సీతారామ సాగర్ జలాలు సమీపంలో ప్రవహిస్తున్నప్పటికీ, పెండింగ్ పనుల వల్ల కాలువలోకి నీరు చేరక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.పెనుబల్లి మండ లంలోని రాతోని (2,300 ఎకరాలు, 5 గ్రామాలు), తాళ్లపెంట (1,600 ఎకరాలు, 2 గ్రామాలు) ఎత్తిపోతల పథకాల పరిధిలో దాదాపు 3,900 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురై ఏడాది గడుస్తున్నా ఇంతవరకు పునరుద్ధరించలే దని గుర్తుచేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున సాధారణ గడువు నిబంధనలతో సంబంధం లేకుండా తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి చేతికొచ్చిన పంటలను కాపాడాలని కోరారు.రఘునాథ పాలెం మండలం జింకలతండా పరిధిలో గత 55 సంవత్సరాలుగా ఈద్గా, ఖబరస్థాన్‌కు సరైన స్థలం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి కేటాయించిన ప్రభుత్వ భూమి ప్రక్రియను వేగవంతం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. తదితర జిల్లా సమస్యలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, రావూరి శ్రీనివాస్ నాయకులు బానోత్ కొండా, బిళ్ళగిరి ధనుంజయ, మేదరమెట్ల శ్రీనివాస్, సైదా రెడ్డి, బిక్కి కృష్ణ ప్రసాద్, బంక మల్లయ్య, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, ముత్యం కృష్ణారావు, బానోత్ రవి, ధారావత్ శంకర్, షేక్ చందు తదితర సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# 14 నుంచి 29 వరకు రోగి భద్రత వారోత్సవాలు

## : డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ రామారావు

**ఖమ్మం, బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** జిల్లాలో రోగి భద్రత ( పేషంట్ సేఫ్టీ) వారోత్సవాలు 14-09-2026 నుండి 29-09-2026 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశాను సారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య సంస్థల్లో రోగుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం, వైద్య సేవల సమయంలో సంభవించే అనుకోని ప్రమాదాలను నివారించడం, భద్రతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది రోగి గుర్తింపు, సరైన మందుల వినియోగం, ఇన్ఫెక్షన్ నియంత్రణ, శస్త్రచికిత్స భద్రత, సురక్షితమైన రక్త మార్పిడి, వైద్య పరికరాల సురక్షిత వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ డి. రామారావు సూచించారు.అలాగే, ఆసుపత్రుల్లో చేతుల పరిశుభ్రత పాటించడం, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించడం, మందుల విషయంలో అప్రమత్తంగా ఉండటం, రోగులకు మరియు వారి సహాయకులకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా అందించడం ద్వారా రోగి భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.ప్రతి ఆరోగ్య సంస్థలో పేషంట్ సేఫ్టీకి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, సిబ్బందికి శిక్షణ, పోస్టర్లు/కరపత్రాల ద్వారా ప్రచారం మరియు ఇతర ఐఈసి కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు



సూచించారు."రోగి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత – సురక్షితమైన వైద్య సేవలే నాణ్యమైన వైద్య సేవలకు పునాది" అని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు పేర్కొన్నారు.

# భక్తరామదాసు భక్తి పై విలువైన స్థలం అప్పగింత



**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** స్థానిక భక్త రామదాసు ధ్యాన మందిరం సమీపంలో ఉన్న అత్యంత విలువైన స్థలం ను భక్తి తో మందిరం కు దానం చేశారు. నేలకొండపల్లి కి చెందిన మర్ల అన్నపూర్ణ, సాయిరాం, సాయికృష్ణ, ప్రమీలాదేవి, అనురాధ, స్వాతిశ్రీ లు అనే రెండు కుటుంబాలు హైద్రాబాద్ లో స్థిరపడ్డారు. వీరికి మందిరం కు ఎదురుగా మొత్తం 300 గజాల స్థలం ఉంది. భక్తరామదాసు పై ఉన్న భక్తి తో అత్యంత విలువైన స్థలం ను మందిరం కు అప్పగించాలని రెండు కుటుంబాలు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థలం ను రిజిస్ట్రేషన్ చేశారు. ఇరు కుటుంబాల వారు మందిరం లో భద్రాచలం దేవస్థానం సూపరిండెంట్ నిరంజన్ కుమార్ సమక్షంలో పత్రాలను అప్పగించారు. దాతల రెండుకుటుంబాలను పదేళ్ల పాటు భద్రాచలం దేవస్థానంలో ప్రత్య దర్శనం చేసుకునే అవకాశం ను కల్పిస్తూ కార్డు ను అందించారు. అనంతరం మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను మందిరం నిర్వహాకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందిరం పూజారి సౌమిత్రి రమేష్, విద్వత్ కళాపీఠం ప్రతినిధులు సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, నంచర్ల దేవీప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దలను వదిలి పేదలకు నోటీసులా....?

- శ్రీనివాస్ నగర్ లో పేదలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి
- కాలుష్య కారక టింబర్ మిల్లులను తరలించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన పెద్దలను వదిలి పేదలకు నోటీసులు -ఇవ్వడం ఏమిటని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. ఎన్నెస్పి కాలువలను ఆక్రమించుకున్న అధికార పార్టీ నాయకుల వైపు కనీసం కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం పేదలను మాత్రం అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. శ్రీనివాస్ నగర్ పేదల ఇండ్లకు తొలగింపు నోటీసులు -ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిపిఐ నాయకులు శ్రీనివాస్ నగర్లో పర్యటించారు. పేదల ఇండ్లకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని గత ప్రభుత్వం జీవో నెం.58 క్రింద క్రమబద్ధీకరించిందని ఆయన తెలిపారు. కోట్లకు పడగలెత్తిన టింబర్ డీపో యజమానులకు అనుకూలంగా అధికారులు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు ఉన్నత న్యాయ స్థానాలకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తారా అని సురేష్ -అధికారులను ప్రశ్నించారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల ఇండ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తుందని అదే పెద్దలు అక్రమించుకుంటే అధికారులు నివేదికలు ఇచ్చినా న్యాయస్థానాలు తీర్పునిచ్చినా ఆ వైపు కన్నెత్తి చూడరని ఆయన తెలిపారు. రోటరీ నగర్ ప్రాంతంలో అధికార పార్టీ నాయకులు లక్షలాది రూపాయల - విలువైన స్థలాలను అక్రమిస్తే ఈ అధికారులు ఎందుకు స్పందించ లేదని పేదలకు ఒక న్యాయం పెద్దలకు మరో న్యాయమని ఆయన నిలదీశారు. పేదల ఇండ్లను తొలగిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. త్రీటౌన్ ప్రాంతానికి కాలుష్యాన్ని కలిగిస్తున్న టింబర్ డిపోలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. టింబర్ డిపోలను తొలగించకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర -సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, నాయకులు సైదా, కుమార్ పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో వేధిస్తున్నారు : బాధితుల ఆవేదన




**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** అక్రమ కేసులతో కూసుమంచి ఎస్ఐ వేధిస్తున్నారని కూసుమంచి మండలం, కేసవాపురం గ్రామానికి చెందిన మందపల్లి శ్రీనివాస రావు, రజనీ, మందపల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు . ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు వేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన పోటు ప్రదీప్, పోటు తిరుమలరావు అనే ఇద్దరు వ్యక్తులు రాళ్ళు, కర్రలతో తమ భూమిలోకి వచ్చి గొడవ చేసారని, వారిపై పోలీసులకు పిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. పైగా తామే దాడి చేశామంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రదీప్, తిరుమలరావు మాపై కూసుమంచి పోలీసులకు ఫి ర్యాదు చేశారని తెలిపారు . ఈ ఘటనపై తాము ఉన్నతాధికారులైన డీజీపీకి 03.11.2025 న ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.ఈ విషయం తెలిసి, కక్ష సాధింపు చర్యగా కూసుమంచి ఎస్సై తమపై అక్రమ సెక్షన్లతో కేసు నమోదు చేసారని, ఇటీవల కోర్టు నుంచి ఈ కేసు గురించి ఛార్జిషీట్ వచ్చిందంటూ తమను స్టేషన్ పిలిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశిల్దార్, సర్వేయర్ గ్రామానికి వచ్చి విచారణ చేసి, తమకు వ్యతిరేకంగా, ప్రదీప్ కు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. అబద్ధపు సంఖ్యలతో, ఎస్సారెస్పీ కాలువ ఉన్న భూమిని మట్టి రోడ్డుగా మాత్రమే చూపుతూ అధికారులు తప్పుడు నివేదికలు తయారు చేశారనీ ఆరోపించారు. మాకు జరిగిన ఈ అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ కేసులను తొలగించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

# భూకబ్జాలకు కేరాఫ్ కేసిఆర్ కుటుంబం

**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కెసిఆర్ ప్రభుత్వం భూ కబ్జాలకు పాల్పడి ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై బిఆర్ఎస్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్సే భూకబ్జాలకు పాల్పడుతుందని అసత్య ప్రచారాలు చేస్తున్నారని నిజాలను నిగ్గు తేల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా భూ కబ్జాదారుల లెక్కలు తెలుస్తానని అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో భూములను కొల్లగొట్టారని అన్నారు. 2004 సంవత్సరంలో కెసిఆర్ ఎంపీ అభ్యర్థిగా ఉన్నప్పుడు వ్యవసాయ భూములు లేవని ఎన్నికల పేర్కొన్నారని ఇప్పుడు ఇన్ని వందల ఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కెసిఆర్ కుమారుడు కేటీఆర్, హరీష్ రావు, సంతోష్, కవిత ప్రభుత్వ భూములను వేల ఎకరాలను ఆక్రమించారని దుయ్యబట్టారు. భూ సమస్యలను పరిష్కరిస్తామని 22ఏలో నిలిచింది జాబితాలో ఉన్న భూ సమస్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని అన్నారు. అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ధనార్జన ధ్యేయంగా లక్షల ఎకరాలు కొల్లగొట్టారని సీలింగ్ యాక్ట్



లేకుండా ఆ పార్టీ నేతలను పెద్ద చేశారని విమర్శించారు. వందల ఎకరాలు ఆక్రమించారని అన్నారు . అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని పేర్కొనడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, ఏ ఐ సి సి సేవాదల్ కో ఆర్డినేటర్ చోటా బాబా, జిల్లా అనుబంద సంఘ అధ్యక్షులు కొత్త సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహీద్ హుస్సేన్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, ఖాజా మురళి,లాల్ సింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన చైతన్యం ముఖ్యం



**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఎయిడ్స్ నివారణ కోసం విద్యార్థులు యువత సామాజిక బాధ్యత తో పాటు అవగాహన చైతన్యాన్ని కలిగివుండాలని సూచించారు.శుక్రవారంనాడు ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నియంత్రణ సంస్థ – కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగాలు ఇతర స్వచ్ఛంద సంస్థలు కళాజాతబృందాలు విద్యార్థులు నిర్వహించిన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర పచ్చజెండా ఊపి ప్రారంభించారు.అనంతరం విద్యార్థులకు సందేశాన్ని అందించారు. దేశాభివృద్ధి లో యువశక్తి కీలకమైన మానవీయ వనరని అన్నారు.చిన్నతప్పు జీవిత స్వరూపాన్నే మార్చేస్తుందని తెలిపారు. ఆరోగ్యకర సమాజమే అభివృద్ధికి బాసటగ నిలుస్తుందన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహమ్మద్ జాకిరుల్లా , జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.రామారావు , కళాశాల ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద,ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.ఎం.పిచ్చయ్య, డా.ధర్మయ్య , అధ్యాపకులు మెడికల్ సిబ్బంది విద్యార్థులు తదితరులపాల్గొన్నారు.

# జాబ్ మేళా కోసం రోడ్డు, దుకాణాల మూసివేత తగదు



**కోదాడ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కోదాడలో జాబ్ మేళా నిర్వహణ సందర్భంగా ఈ నెల 19న శనివారం నాడు ఖమ్మం క్రాస్ రోడ్ నుండి శ్రీరంగాపురం స్టేజి వరకు ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలతో పాటు వాహనాల రాకపోకలను నిషేధించే ఆలోచనను నిర్వాహకులు తక్షణమే విరమించుకోవాలని సామాజిక ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే సదుద్దేశ్యంతో మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కోదాడలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయం అని ప్రశంసించారు . కాని జాబ్ మేళా పేరుతో రోడ్ల నిండా ఫ్లెక్సీలు కట్టి, మైకులతో హోరెత్తిస్తుందటంతో పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని విమర్శించారు. పైగా నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించే వేదిక ఉన్నందున ఖమ్మం క్రాస్ రోడ్ నుండి శ్రీరంగాపురం స్టేజి వరకు ప్రధాన రహదారిపై వ్యాపారం చేసుకొంటున్న వందలాది దుకాణాలను మూసి వేయించాలనే ఆలోచనను విరమించుకొని, దుకాణాలను యధావిధిగా తెరిచేందుకు అనుమతించాలని, అదేవిధంగా ప్రధాన రహదారిపై రోజూలాగానే వాహనాల రాకపోకలను సైతం అనుమతించాలని జాబ్ మేళా నిర్వాహకులకు విజ్ఞప్తి చేసారు.లేనియెడల వేల సంఖ్యలో ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేసారు.

# బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్ -2026



**శేర్లింగంపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** దేశ ప్రగతి కోసం, రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న,మన ప్రియతమ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ 76వ పుట్టినరోజు సందర్భంగా,హాఫీజ్ పేట్ డివిజన్,ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డులోని శ్రీ వినాయక మండపం వద్ద , "ఆశీర్వాద జ్యోతులు" వెలిగించి,ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, శతాయుష్షుగా వర్ధిల్లాలని అని,దేశ సేవలో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ,ఆ దేవదేవుని వేడుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మూల అనిల్ గౌడ్ ,బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సజ్జ కోటేశ్వర రావు, శ్రీధర్ రావు ,బీజేపీ సీనియర్ నాయకులు పృథ్వీ కాంత్ గౌడ్, హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, బీజేపీ నాయకులు నందు, కిరణ్ , దయానంద్ ,గిరి,శ్రీనివాస్ ,రాజు , సుబ్రమణ్యం ఇతరులు పాల్గొన్నారు.

# మియాపూర్ లో నైలా అపార్ట్మెంట్స్ వాసుల ఆధ్వర్యంలో వినాయక పూజా కార్యక్రమాలు



**శేర్లింగంపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మియాపూర్ లో నైలా అపార్ట్మెంట్స్ వాసుల ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక పూజా కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎం ఎల్ ఏ, పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. నైలా అపార్ట్మెంట్ సభ్యులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనిన అతిథిలను శాలువాలతో సత్కరించారు.

# మియాపూర్ నైలా కమ్యూనిటీ ఉత్సవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా



**మియాపూర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మియాపూర్ నైలా కమ్యూనిటీ ఉత్సవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు మధు, కార్తీక్, సుమంత్, మాధవ వర్మ తదితరులు మర్యాదపూర్వకంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ , యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ ని కలిసి, నైలా కమ్యూనిటీలో నిర్వహించనున్న శ్రీ వినాయక చతుర్థి మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నైలా కమ్యూనిటీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న శ్రీ వినాయక చతుర్థి మహోత్సవాలు మరియు అన్నదాన కార్యక్రమానికి హాజరై, కార్యక్రమంలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయవలసిందిగా అసోసియేషన్ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ నిర్వాహకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేసిన నేపథ్యంలో, ఆయనపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి. డి హెచ్ పి ఎస్ జాతీయ నాయకులు.టి. రామకృష్ణ డిమాండ్ చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, ఆయన చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం అని ఆయన పేర్కొన్నారు.అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగ విలువలను అవమానించడమేడాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదని, కోట్లాది అణగారిన వర్గాల ప్రజలకు హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం అందించిన మహానీయుడని రామకృష్ణ అన్నారు.ప్రపంచ మేధావి అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా చిత్రీకరించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన పోరాటాన్ని చరిత్ర నుంచి చెరిపివేయడం ఎవరి తరం కాదని అన్నారు.రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను బాధ్యతారహితమైన అవమానకర ప్రచారాలకు ఉపయోగించరాదని, భావ ప్రకటనా స్వేచ్ఛతో పాటు ఇతరుల గౌరవం, సామాజిక సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ సమగ్ర విచారణ జరపాలి.హమారా ప్రసాద్‌పై నమోదైన కేసులో ఆరోపణల స్వభావాన్ని సమగ్రంగా విచారించి, వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని టి. రామకృష్ణ డిమాండ్ చేశారు.దేశద్రోహం తదితర కఠిన నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని చట్టపరంగా పరిశీలించాలని, నేరం రుజువైతే చట్టం ప్రకారం శిక్షించాలని కోరారు.అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలు, కులమత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.

# మియాపూర్ నైలా కమ్యూనిటీ ఉత్సవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గణేశ్ చతుర్థి వేడుకలు..



**మియాపూర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మియాపూర్ లో నైలా కమ్యూనిటీ ఉత్సవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు మధు, కార్తీక్, సుమంత్, మాధవ వర్మ తదితరులు మర్యాదపూర్వకంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ , యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ ని కలిసి, నైలా కమ్యూనిటీలో నిర్వహించనున్న శ్రీ వినాయక చతుర్థి మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నైలా కమ్యూనిటీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న శ్రీ వినాయక చతుర్థి మహోత్సవాలు మరియు అన్నదాన కార్యక్రమానికి హాజరై, కార్యక్రమంలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయవలసిందిగా అసోసియేషన్ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ నిర్వాహకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి కేసీఆర్ కృషి మరువలేనిది

- **కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బోనకల్ గిరిజన కాలనీవాసులు**
- **గిరిజనుల ఆత్మగౌరవానికి బాటలు వేసిన కేసీఆర్: లింగాల కమల్‌రాజు**



**బోనకల్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ బోనకల్ మండల కేంద్రంలోని గిరిజన కాలనీవాసులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరయ్యారు. మాజీ జడ్పీటీసీ బానోతు కొండతో పాటు గిరిజన కాలనీ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ల పెంపుతో పాటు తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.గిరిజనుల ఆర్థిక స్వావలంబన కోసం గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సహకార ఆర్థిక సంస్థల ద్వారా వివిధ ఆర్థిక సహాయ కార్యక్రమాలు అమలు చేసినట్లు వారు గుర్తుచేశారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, విద్య, తాగునీరు, గృహాలు, విద్యాసంస్థలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. గిరిజనుల కోసం ప్రత్యేక నిధులు.. ప్రత్యేక అభివృద్ధిఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి ద్వారా గిరిజన ప్రాంతాలకు కేటాయింపులు చేయడం, గిరిజన ఆవాసాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు వెచ్చించడం, గిరిజన విద్యార్థులకు గురుకుల విద్య, ఉపకార వేతనాలు, ఉన్నత విద్యకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పత్రాల ప్రకారం 2022–23లో ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.13,412.63 కోట్ల ప్రతిపాదిత కేటాయింపు ఉన్నట్లు నమోదైంది.రిజర్వేషన్ల పెంపుతో కొత్త అవకాశాలుగిరిజనులకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ 2022లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ అధికారిక పత్రాలు పేర్కొంటున్నాయి.తండాలకు ప్రత్యేక గుర్తింపుగతంలో మౌలిక వసతుల కొరతతో వెనుకబడిన అనేక గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా ప్రజలకు పాలనా అవకాశాలు పెరిగాయని వారు తెలిపారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 1,750 గిరిజన తండాలు గ్రామపంచాయతీలుగా మారాయి.బానోతు కొండ మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలను గుర్తించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు గిరిజన సమాజానికి ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను భవిష్యత్ తరాలు గుర్తుంచుకుంటాయని పేర్కొన్నారు.గిరిజన సమాజం అభివృద్ధి చెందితేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, గిరిజన యువత విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో ముందుకు సాగేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ, మరియు పంచాయతీ కార్యవర్గ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నేతలు, గిరిజన కాలనీకి చెందిన నాయకులు, యువత, మహిళలు, పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

# బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా జియాగూడ నుండి శంషాబాద్ కు తీన్మార్ మల్లన్న పాదయాత్ర







**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర రెండో రోజు విజయవంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం ఈ పాదయాత్ర జియాగూడ నుంచి ప్రారంభమై ఆరాంఘర్, గగన్ పహాడ్ మీదుగా శంషాబాద్ వరకు కొనసాగింది. రెండో రోజు యాత్రలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. పాదయాత్ర పొడవునా రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులను, స్థానికులను మల్లన్న ఆప్యాయంగా పలకరిస్తూ బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్య ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్మికులు మల్లన్నను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సంస్థల వ్యవస్థ వల్ల తమ శ్రమ దోపిడీకి గురవుతోందని, రాత్రింబవళ్లు కష్టపడుతున్నా తగిన వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంస్థల వ్యవస్థను రద్దు చేసి తమను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని కోరారు. గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన మల్లన్న కార్మికులకు అండగా ఉంటానని, వారి శ్రమను దోచుకుంటున్న సంస్థల వ్యవస్థ రద్దు అయ్యే వరకు పోరాడుతానని భరోసా ఇచ్చారు. మూడో రోజు యాత్ర శనివారం ఉదయం 8 గంటలకు శంషాబాద్ నుండి ప్రారంభమై పాలమాకుల, తిమ్మాపూర్ మీదుగా కొత్తూరు, నందిగామ వరకు సాగనుందని, కొత్తూరు, నందిగామ మండల ప్రధాన కూడళ్లలో బహిరంగ సమావేశాలు ఉంటాయని, రాత్రికి నందిగామలోనే బస చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

# తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించడమే లక్ష్యం: ఎంఈఓ లక్ష్మణ్ నాయక్




**షాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
షాబాద్ మండలంలోని తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి పద్య పఠన పోటీలు ఘనంగా నిర్వహించారు. జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు చక్కటి ఉచ్చారణ, భావవ్యక్తీకరణతో పద్యాలను పఠించి తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి డి. లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మాతృభాషపై అభిమానం పెంపొందించడంతో పాటు తెలుగు పద్యాల ప్రాశస్త్యం, కవుల గొప్పతనాన్ని పరిచయం చేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్ననాటి నుంచే పద్య పఠనంపై ఆసక్తి పెంపొందించుకుంటే భాషపై పట్టు, జ్ఞాపకశక్తి, భావవ్యక్తీకరణ సామర్థ్యం మెరుగుపడుతాయని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. కిరణ్మయి మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు పద్యాలను చదవడంతో పాటు వాటి భావాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. తెలుగు భాష, సాహిత్యంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని కోరారు.విజేతలు: 6వ తరగతిలో ఎం. గీతాంజలి ప్రథమ, కే. నిహారిక ద్వితీయ; 7వ తరగతిలో జి. మధుప్రియ ప్రథమ, డి. ఆద్యశ్రీ ద్వితీయ; 8వ తరగతిలో ఎం. భవేష్ ప్రథమ, మాయ శ్రీ ద్వితీయ; 9వ తరగతిలో ప్రవస్తి ప్రథమ, మౌనిక ద్వితీయ; 10వ తరగతిలో ఎస్. ప్రణవి ప్రథమ, మీనాక్షి ద్వితీయ స్థానాల్లో నిలిచారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్వర్ రెడ్డి, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్, బాలకృష్ణ, సుశీల, విమల, లీల, అనురాధ, రాజ్యలక్ష్మి , కవిత, నాగరాణి, గ్లోరీ, అశోక్ గౌడ్, మహేందర్, నర్సింలు, కృష్ణ, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళా రంగంలో చెరగని ముద్ర 'నగేష్'





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
ఖమ్మం కళారంగంలో ఒక నూతన ఒరవడిని ప్రవేశపెట్టి సంచలనాలకు కేంద్ర బిందువైనాడు.దీర్ఘ,సుదీర్ఘ గాన వల్లరులతో సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాడు ఇసనపల్లి నగేష్.సరిగ్గా రెండు సంవత్సరాల మూడు నెలల కిందట స్వరమధురిమ కల్చరల్స్ ను స్థాపించి అనతి కాలంలోనే గుర్తింపు తెచ్చుకున్నాడు. తన బ్యానరైన స్వరమధురిమ పేరుతో 32 గంటల నిర్విరామ సుదీర్ఘ గీతాలాపనను ఘనంగా నిర్వహించి అందరినీ ఆశ్చర్య పరిచాడు. అప్పటి వరకూ కేవలం రాత్రిపూట మాత్రమే నిర్వహించబడిన సంగీత కార్యక్రమాల రూపు రేఖలు మార్చి ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్విరామ సంగీత కార్యక్రమాలకు నాంది పలికి సంగీత ప్రియులకు పూర్తి వినోదాన్ని కల్పించడంలో సఫలత సాధించాడు.దీంతో ఖమ్మం కళా రంగంలో చెరిగిపోని ముద్ర వేసుకున్నాడు నగేష్. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని స్టార్ మేకర్ సింగర్స్ ని ఖమ్మం రప్పించి ఒకే వేదికపై సినీ గీతాల ప్రదర్శన నిర్వహించిన సాహసం ఆయనిది.ఈ క్రమంలోనే ఖమ్మం గాయని వంజా మాలతీనాయుడు కొన్ని ఈవెంట్లలో మాత్రమే తళుక్కుమనినా 2024 లో నగేష్ నిర్వహించిన 32 గంటల భారీ కార్యక్రమంలో 32 మంది ఉభయ తెలుగు రాష్ట్రాల గాయకులతో కలిసి 400 పై చిలుకు పాటలు పాడి అంతర్జాతీయ రికార్డులు సాధించిన తరువాతే ఆమెకు ఎక్కడ లేని కీర్తి లభించింది.రెండు తెలుగు రాష్ట్రాలలో గాయనిగా ప్రాచుర్యం పొందారు.అదేవిధంగా గుంటూరు గాయని నాగశ్రీ చేత రికార్డ్ ప్రోగ్రాం నిర్వహించి ఆమెను ఖమ్మానికి పరిచయం చేశాడు.అశ్వాపురం మండలానికి చెందిన దేవమణి ఖమ్మం ప్రేక్షకులకు పరిచయంలేని తరుణంలో ఆమె చేత దీర్ఘ గానాలాపన చేయించి రికార్డు నెలకొల్పిన పిమ్మట మంచి గుర్తింపు ఆమెకు ఇక్కడ లభించింది.కొత్తగూడెంకు చెందిన గాయని లక్ష్మీప్రసన్న ను తన బ్యానర్ ద్వారా దీర్ఘ గానార్చన చేయించి వరల్ రికార్డ్ సాధించేలా నగేష్ కృషి చేసాడు.దీంతో ఆమే ఖమ్మం ప్రేక్షకులకు దగ్గరయ్యారు.ఖమ్మం నగరానికి చెందిన గాయని కీర్తన అప్పటికే మంచి గాయనిగా పేరున్నప్పటికీ నగేష్ నిర్వహించిన దీర్ఘ గానవాహిని ద్వారా రికార్డు సృష్టించి మరింత పేరు గడించారామె. అదే విధంగా చిన్నారుల చేత దీర్ఘ నృత్య ప్రదర్శన నిర్వహించి రికార్డు నెలకొల్పాడు.సుపరితులైన గాయకులు వీవీ రెడ్డి తొమ్మిది వరల్డ్ రికార్డులు సాధించడంలో నగేష్ బ్యానరుపై నిర్వహించిన దీర్ఘ గానాలాపన ద్వారానే సాధ్యమైంది.ఎంతో మంది కొత్త గాయకులను వేదికలపై పరిచయం చేయడంలో,గాయనీ గాయకులు ప్రపంచ రికార్డులు నెలకొల్పడంలో నగేష్ ప్రముఖమైన పాత్ర మరువలేనిది.ఆయన నిర్వహించిన కార్యక్రమాలన్నీ భారీగానే వున్నాయి.ఏర్పాట్లలో ఎక్కడా రాజీ పడని తత్వం,కార్యక్రమం సందర్భంలో రేయింబవల్లు నిద్రాహారాలు మాని కష్టపడడం ఆయన నైజం.దీంతో మంచి ఆర్గనైజర్ గా గుర్తింపు పొందాడు.చివరిగా తొమ్మిది వరల్డ్ రికార్డులు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని వీవీ రెడ్డి,లక్ష్మీనారాయణ చార్యులను ఘనంగా సత్కరించి ఖమ్మం కళా రంగం నుంచి శాశ్వితంగా నిష్క్రమించాడు. కళాక్షేత్రానికి సెలవంటూ భౌతికంగా దూరమయ్యాడు.ఆ ట్రెండ్ సెట్టర్ కు ఇదే అక్షర నివాళి.

# మైలార్ దేవ్ పల్లి విభాగంలో వినాయక మండపాలను సందర్శించిన తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి విభాగం పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, ఆర్ జీ కే నగర్, కాటేదాన్ పలు ప్రాంతాల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల్లో స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బాధ్యులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువకులందరూ భక్తి శ్రద్ధలతో పండుగను శాంతియుత వాతావరణంలో ఆనందంగా నిర్వహించుకోవాలని తెలియజేశారు. యువకులు, ప్రజలు పోలీసు అధికారులకు సహకరించాలని, మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# హరిత హారతి.. ప్రకృతి పరవశం



**నేటి శుభోదయ :**

**మేఘాల ముసుగు తీసి మెరిసింది ఆకాశం,**
**ఆకుపచ్చని నేలపై కురిసింది అమృత కిరణం!**
**కొండల కోనల నడుమ హరిత తివాచీలు,**
**భాస్కరుడి రాకతో వెలిగాయి స్వర్ణ దీపాలు!**
**వెండి మబ్బుల పొరలను చీల్చుకుంటూ వచ్చి,**
**ధరణి మాత నుదుట సూర్యుడు పెట్టాడు తిలకం!**
**ఆ వెలుగుల వెల్లువలో తడిసిన అరకు లోయ,**
**కనుల ఎదుట సాక్షాత్కరించిన విరించుడి మాయ!**
**వంకర టింకర మట్టి దారుల సవ్వడి,**
**మనసును రంజింపజేసే ప్రకృతి బడి !**
**ఈ రమణీయ దృశ్యం కవుల కలాలకు సవాలు.!**
**కనులారా చూస్తే తీరును జన్మ జన్మల దాహాలు!**

( గిరి ప్రసాద్ సోముల )

# బైక్ బజార్ల దోపిడీ..
# వినియోగదారుల విలవిల

- నాసిరకం రిపేర్లు.. పాత బైక్‌లకు కొత్త రంగులు
- అధిక వడ్డీ ఫైనాన్స్‌తో నిలువు దోపిడీ ఆరోపణలు
- ఈఎంఐ ఆలస్యమైతే బెదిరింపులు.. రోడ్డుపైనే సీజింగ్ హంగామా







**ఎల్బీనగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
ఎల్బీనగర్ పరిధిలో కొన్ని బైక్ బజార్లు, వాటికి అనుబంధంగా పనిచేస్తున్న ఫైనాన్స్ వ్యవహారాలపై వినియోగదారుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత ద్విచక్ర వాహనాలను నాసిరకంగా మరమ్మతులు చేసి, బయటకు కొత్తవాటిలా కనిపించేలా చేసి విక్రయించడమే లక్ష్యంగా కొన్ని వ్యాపారాలు సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వాహనం కొనుగోలు చేసేందుకు వచ్చే సామాన్యులను లక్ష్యంగా చేసుకుని అధిక వడ్డీతో ఫైనాన్స్ చేసి ఆర్థికంగా భారాన్ని మోపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకటి, రెండు ఈఎంఐలు ఆలస్యమైనా ఫైనాన్స్ సిబ్బంది పేరుతో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, దాడులకు దిగుతున్నారని, వాహనాలను బలవంతంగా తీసుకెళ్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

**రోడ్డుపైనే 'సీజింగ్' హంగామా.?**
వాహనం సీజ్ చేయాలనే పేరుతో ఐదు నుంచి పది మంది వరకు వ్యక్తులు రోడ్లపై గుంపుగా నిలబడి వాహనదారులను అడ్డుకుని, రౌడీలవలె వ్యవహరిస్తూ దౌర్జన్యంగా వాహనాలను లాక్కెళ్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు. చట్టబద్ధమైన రికవరీ ప్రక్రియకు బదులుగా రోడ్డుపైనే దౌర్జన్యం చేసి బలవంతపు సీజింగ్ చేయడం ఎంత వరకు సమంజసమన్న వినియోగదారుల నుండి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**'సెటిల్మెంట్' పేరుతో మరో దోపిడీ.?**
ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితుల్లో వినియోగదారులతో సెటిల్మెంట్ పేరుతో వాహనాలను తీసుకుని, వాటి విలువకు పూర్తిగా తగిన మొత్తాన్ని చెల్లించకుండా తక్కువ డబ్బుతో వ్యవహారం ముగిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వాహనం మార్కెట్ విలువ, ఇప్పటికే చెల్లించిన ఈఎంఐలు, బకాయిల వివరాలను పారదర్శకంగా చూపకుండా వినియోగదారులను ఒత్తిడికి గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.సామాన్యుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వాహన విక్రయాలు, ఫైనాన్స్, సీజింగ్ పేరుతో ఎవరైనా అక్రమాలకు పాల్పడుతున్నారా అనే అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ఎల్బీనగర్‌లోని బైక్ బజార్లు, అనుబంధ ఫైనాన్స్ సంస్థలపై రవాణా, పోలీస్, వినియోగదారుల పరిరక్షణ, సంబంధిత నియంత్రణ సంస్థలు దృష్టి సారించాలి. నాసిరకం వాహనాల విక్రయాలు, అధిక వడ్డీ, బెదిరింపులు, దౌర్జన్యపు సీజింగ్ వంటి ఆరోపణలు పై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## కష్టపడే కార్యకర్తలకే కాంగ్రెస్‌లో గుర్తింపు

- మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్



**మంథని, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ల ఆశీస్సులతో పదవులు స్వీకరించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శిగా ఎన్నికైన ఆరెల్లి కిరణ్ గౌడ్, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం చైర్మన్ గా వంగల తిరుమలేష్, శ్రీ గౌతమేశ్వర ఆలయం చైర్మన్ గా గుండ రాజు వీరి నియామక పట్ల చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గం తరుపున శుక్రవారం మున్సిపల్ కార్యలయంలో వారికి సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పథకాలను మంథని నియోజకవర్గం, మునిసిపాలిటీలో జరుగుతున్నటు వంటి అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆరెల్లి కిరణ్ గౌడ్ కి సూచించారు, శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ చైర్మన్ వంగల తిరుమలేష్, శ్రీ గౌతమేశ్వర ఆలయ చైర్మన్ గుండ రాజు లకు రాబోయే పుష్కరాలను విజయవంతం చేయాలని, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని అదేవిదంగా శ్రీ లక్ష్మీనారాయణ ఆలయం వద్ద ఏ పండుగ వచ్చిన భక్తులు అధిక సంఖ్య లో స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తుంటారు అందుకు అనుగుణంగా తగిన భద్రతలు చేపట్టి, ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లకు తెలిపారు . మీ ముగ్గురికి కూడా మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు లతో పాటు మా పాలకవర్గం కూడా మీకు ఎల్లప్పుడూ మద్దతు గా ఉంటుందన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి ఆరెల్లి కిరణ్ గౌడ్, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం చైర్మన్ వంగల తిరుమలేష్, శ్రీ గౌతమేశ్వర ఆలయం చైర్మన్ గుండ రాజు మాట్లాడుతూ మాపై నమ్మకంతో అవకాశం కల్పించినందుకు ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు , మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు , మహిళ నాయకురాలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.




Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620